Whatsapp No: 9440662699

www.rajadhanivartalu.com   facebook.com/rajadhaniv

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 2 సంచిక 49, పేజీలు 8 రూ. 2/-   ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక   ఆగస్టు సోమవారం 28- సెప్టెంబరు ఆదివారం 3-2017




## రాజ్యసభకు పూర్వవైభవం తెస్తా

వెంకయ్యనాయుడు





**రా.వా.ప్రతినిధి,అమరావతి :** రాజ్యసభ ఛైర్మన్‌గా సభకు పూర్వ వైభవం తీసుకొస్తానని, పెద్దల సభగా మారుస్తానని వెంకయ్యనాయుడు పౌరసన్మాన సభలో చెప్పారు. తనకు పట్టుదల ఎక్కువని, ఏదైనా అనుకుంటే సాధించేదాకా విశ్రమించలేదని మనసు, శరీరాన్ని అనుసంధానించి పనిచేసేవాడినని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. దేశంలోనే రెండో అత్యున్నత పదవైన ఉపరాష్ట్రపతి పదవి తనకు దక్కడం, తాను చేసుకున్న అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరయ్యారు. పార్లమెంటులో దేశ భవిష్యత్తును మార్చేలా అర్థవంతమైన చర్చలు జరగాలని, అవినీతిని అంతమొందించేలా చట్టాలు రావాల్సిన అవసరం ఉందని వెంకయ్య అన్నారు. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి, ఆవేదన దేశానికి మంచిది కాదని, ఇది ప్రజాస్వామ్యానికి, చట్ట సభలకు మంచిది కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా కూలిపోయే అవకాశం ఉందని, ఈ పరిస్థితి తలెత్తకుండా కాపాడాల్సిన బాధ్యత చట్ట సభలపై ఉందని తెలిపారు. రాజకీయ పార్టీలన్నీ రాజకీయ విరోధులే కాని, శత్రువులు కాదని, అందుకే, విమర్శలు చేసుకునేటప్పుడు సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలు తమను ప్రశ్నిస్తారని, ప్రజల్లో తాము చులకన అవుతామనే భయం ప్రజాప్రతినిధుల్లో ఉండాలని చెప్పారు.

**ఉపరాష్ట్రపతిగా తొలిసారి నాగడ్డపై అడుగుపెట్టా..**

ఉప రాష్ట్రపతి అయ్యాక తొలిసారి నా గడ్డపై అడుగుపెట్టానని వెంకయ్యనాయుడు అన్నారు. నాకు లభించిన అపూర్వస్వాగతాన్ని మరచిపోలేనని అన్నారు. తనకు సన్మానం చేసిన ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపుతున్నానన్నారు. సన్మానాలు కర్తవ్యాన్ని గుర్తు చేస్తాయని వివరించారు. ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. చేపట్టిన ప్రతి పదవికి న్యాయం చేశానని భావిస్తున్నానని చెప్పారు. రాజ్యసభలో కొత్త ప్రమాణాలు నెలకొల్పి పెద్దల సభకు పునర్వైభవం తెస్తానని ఆయన అన్నారు. రాజకీయాలకు అయామ్ రిటైర్డ్... నాట్ టైర్డ్ అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు.

**ఇది నా అదృష్టం: చంద్రబాబు**

ప్రజల తరపున వెంకయ్యకు సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. వెంకయ్యనాయుడు, నేను ఒకేసారి ఎమ్మెల్యేలుగా గెలిచామన్నారు. తన వాగ్దాటితో అధికార పక్షాన్ని వెంకయ్య గడగడలాడించారని, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి వెంకయ్య అని ఆయన అన్నారు. దేశ రాజకీయాల్లో రాణించేందుకే వెంకయ్య హిందీ నేర్చుకున్నారని వెల్లడించారు. విభజన సమయంలో ఏపీకి వెంకయ్య అండగా నిలిచారని చెప్పారు. రాజ్యసభలో ఏపీ తరపున తన గళం విన్పించారని చెప్పుకొచ్చారు.

# తీర్పుతో విధ్వంసం

## కొనసాగుతున్న డేరా హింస

**దేశంలో బాబాలు పడ్డారు. మొన్న చంద్రస్వామి, నిన్న ఆశారాం బాబా, నేడు గుర్మీత్ రామ్ రహీం సింగ్ .బాబాల అరాచకాలకు అంతులేకుండా పోతోంది. గుర్మీత్‌కు సొంత సైన్యం. జడ్‌ప్లస్ సెక్యూరిటీ, తెలంగాణలోని నల్గొండ మండలం చిట్యాలలోని వెల్మినేడులో సహా పలురాష్ట్రాల్లో ఆస్తులు కూడబెట్టి భక్తిముసుగులో ధార్మిక సంస్థల పేరుతో యథేచ్ఛగా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అనుచరుల పేరుతో విధ్వంసానికి పాల్పడుతున్న సంఘవ్యతిరేక శక్తులు.. వంతపాడుతూ సామాన్య పౌరులకు రక్షణ లేకుండా చేస్తున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వాలతో దేశం అట్టుడుకుతోంది.**



హర్యానాలోని సిర్సా నుంచి పంచకుల కోర్టుకు 200 కి.మీ దూరం ఉంది. కోర్టుకు హాజరుయ్యేందుకు ఆయన 200 కార్లలో తన అనుచరులతో వచ్చారు. తనకు శిక్షపడితే విధ్వంసం సృష్టించేందుకు, నిర్దోషిగా విడుదలైతే సంబరాలు జరుపుకునేందుకు ముందుగానే వ్యూహం పన్నిన డేరా బాబా కోర్టు బయట వేచి ఉండాల్సిందిగా అనుచరులకు పిలుపునిచ్చారు. దీనితో 70,000 మంది అక్కడికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం డేరాబాబా అలియాస్ గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను రేప్‌కేసులో దోషిగా సీబీఐ కోర్టు తీర్పు వెలువరించగానే అరాచక మూకలు విధ్వంసానికి పూనుకున్నాయి. అయితే వీరి వ్యూహాన్ని ముందుగానే తెలుసుకున్న హర్యానా హైకోర్టు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, సిర్సా, పంచకులతో పాటు మరిన్ని ప్రదేశాల్లో 144 సెక్షన్ విధించి, సైన్యాన్ని సిద్ధంగా ఉంచాలని ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారుల్ని ఆదేశించింది. అయితే హర్యానా ముఖ్యమంత్రి మావోహర్‌లాల్ కట్టర్ హైకోర్టు ఆదేశాలకు బేఖాతరు చేశారు. దీంతో డేరా బాబా అల్లరిమూకలు విధ్వంసానికి దిగాయి. అక్కడ ఉన్న ఓబీ వ్యాన్లకు, నిప్పంటించారు. విలేకర్లను లక్ష్యం చేసుకొని దాడులు కొనసాగించారు. క్షణాల్లో హర్యానా అంతటా హింసా ఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. కొన్ని చోట్ల అల్లరి మూకలు పోలీసులపై రాళ్లదాడి జరిపారు. పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించి అల్లరిమూకలను చెల్లాచెదురు చేశాయి. పంజాబ్‌లోనూ ఇదే పరిస్థితి. ఈ అల్లర్లలో ఇప్పటివరకు ఏడుగురు మహిళలతో సహా 32 మంది మృతి చెందగా, 350 మందికి గాయాలయ్యాయి. క్షణం క్షణం పెరుగుతున్న బాధితులతో ఆసుపత్రులు కిక్కిరిసిపోయాయి. అల్లర్లు ఢిల్లీకి పాకాయి. డేరాబాబా

- మిగతా 5 లో

## కష్టపడి పనిచేయాలి

లావు శ్రీకృష్ణ దేవరాయలు



**రా.వా ప్రతినిధి,తాడికొండ :** జన్మభూమి కమిటీల పెత్తనంతో టీడీపీ పతనం మొదలైందని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ పార్టీకార్యకర్తలు పనిచేస్తే 2019 ఎన్నికల్లో అఖండ విజయం సాధించవచ్చున్నారు. తాడికొండలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి నవరత్నాల సభకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేవరాయలు మాట్లాడుతూ అధికార టీడీపీ నంద్యాలలో అక్రమాలకు పాల్పడిందన్నారు. ఓటుకు రూ.5 వేల వరకు పంచుతూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని, రాబోయే ఎన్నికల్లో కూడా ఇలాంటి తప్పుడు చర్యలకు పాల్పడే అవకాశం ఉండటంతో నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టీడీపీ తప్పుడు విధానాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత బూత్ కమిటీలపై ఉందన్నారు. విలువలు, విశ్వసనీయతతో నడుస్తూ ముందు కెళుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే విలువైన ఆస్తనివారు కష్టపడి పనిచేస్తున్నారన్నారు.

**ముస్లింలకు అన్యాయం చేసింది టీడీపీనే : ముస్తఫా**

ముస్లిం సామాజిక వర్గానికి కనీసం ఓ మంత్రి పదవి కూడా ఇవ్వకుండా అన్యాయం చేసిన ఘనత ఒక్క చంద్రబాబు నాయుడుకే చెల్లిందని ఎమ్మెల్యే ముస్తఫా అన్నారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే చేశారని, టీడీపీ పాలనలో దోపిడీ పెరిగి పోయిందని, అబద్దాలతో అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.






# రాజధాని వార్తలు

కలం

## గోప్యతకే పట్టం

ఈ వారం చాలా ప్రత్యేకమైంది. అత్యున్నత న్యాయస్థానం రెండు చారిత్రాత్మక తీర్పులను వెల్లడించింది. ఒకటి ట్రిపుల్ తలాక్‌కు చట్టబద్ధత లేదని తేల్చిచెప్పగా రెండోది పౌరులకు వ్యక్తిగత గోప్యతా హక్కు ప్రాథమిక హక్కుగా స్పష్టం చేసింది. జీవించడం అంటే ప్రాణాలతో ఉండటం కాదని, గౌరవ, మర్యాదలకు భంగం కలగకుండా జీవించే హక్కని సుప్రీంకోర్టు పేర్కొంది. చట్టాల ద్వారా కార్యనిర్వాహక వ్యవస్థకు సంక్రమించే అధికారాలకు సౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మధ్య వైరుధ్యం ఏర్పటినప్పుడు రెండింటి మధ్య సమన్వయం ఉందో లేదో నిర్థారించడం, రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కులు కబ్జాకు గురికాకుండా చూసే బాధ్యత న్యాయవ్యవస్థ భుజస్కందాలపై ఉంది. దేన్ని ఎంపిక చేసుకోవాలో, దేన్ని తోసిపుచ్చాలో నిర్ణయం తీసుకునే హక్కు పౌరులకు ఉందని గురువారం తీర్పు వెలువరిచండం ముదావహం. జీవించే హక్కుతో ముడిపడి ఉన్న రాజ్యాగంలోని 21వ అధికరణ పరిధిని పరిశీలించి, వాదోపవాదాల అనంతరం ఈ విలువైన తీర్పును చీఫ్ జస్టిస్ ఖేహర్ నేతృత్వంలోని 9మంది సభ్యులతో కూడిన ధర్మాసనం వెలువరించింది. 2009లో కేవలం పాలనాపరమైన ఒక ఉత్తర్వు ద్వారా మొదలైన ఆధార్ తర్వాత కాలంలో అన్నింటా వ్యాప్తి చెందింది. 2010లో పార్లమెంటు స్థాయి సంఘం ఈ తిరస్కరించినా ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టడంతో 2012లో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల కేసు దాఖలైంది. ఆధార్‌తో వ్యక్తిగత గోప్యతకు భంగం అని పిటిషనర్లు వాదించారు. దీనిని అధిగమించేందుకు ఆధార్‌ను ప్రభుత్వం ద్రవ్యబిల్లుగా చూపి నెగ్గింది. ఆధార్‌తో కోసం బలవంతపు సమాచార సేకరణ లేదంటూనే జనంపై సర్కార్ ఒత్తిడి పెంచింది. 1954లో ఎంపీ శర్మకేసులో 8 మంది న్యాయమూర్తుల ధర్మాసనం, 1962లో ఖరగ్‌సింగ్ కేసులో ఆరుగురు జడ్జిలతో, వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుకాదని తీర్పు చెప్పింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై దర్యాప్తు సంస్థలు జరిపే నిఘా, నియంత్రణ, సోదాలకు సంబంధించిన వ్యవహారాల్లో గోప్యత విషయంపై వెలువరించిన తీర్పులు అవి. ప్రస్తుతం దేశంలోని జనాభాకు సంబంధించిన సందర్భం కాబట్టి 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పు వెలువరించింది. గతంలో మల్ (1981), రాజగోపాల్ (1984), పీయూసీఎల్ (1997), జిల్లా రిజిస్ట్రార్ (2005), సుచిత (2009) , సెల్వీవ (2010)నల్సా (2014) గోప్యతా హక్కును రాజ్యాంగ హక్కుగా అత్యున్నతా న్యాయ స్థానం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతిపౌరుడు దోపిడీకి గురవకుండా ఉండటం, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలు పెరగడం, పనిచేసే చోట లైంగిక దోపిడీకి గురికాకుండా ఉండటం జీవించే హక్కులో భాగం. వ్యక్తిగత గోప్యతపై విచారణలో కేంద్రం స్పష్టంగా తన వాదనను వినిపించలేకపోయింది. గోప్యత ప్రాథమిక హక్కా కాదా అని ప్రధానన్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ అగిగిన ప్రశ్నకు అటార్నీ జనరల్ నేరుగా జవాబివ్వలేదు. గోప్యత ప్రాథమిక హక్కే అని అనుకున్నా దానిలో అనేక అంశాలున్నాయని ఆయన జవాబిచ్చారు. సమాజ ఉన్నతిని కాంక్షించే రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడం కోసమే సంయమనంతో, ముందుచూపుతో వ్యవహరించి అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించి కర్తవ్యోముఖాన్ని ప్రజల ముందుంచింది.

## బంగారం దిగుమతులపై నిషేధం

**న్యూఢిల్లీ :** దక్షిణ కొరియా నుంచి విపరీతంగా బంగారం, వెండి దిగుమతులు పెరుగుతుండటంతో, వీటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ ఉత్పత్తులను నియంత్రిత కేటగిరీలోకి చేర్చింది. దీంతో బంగారం, వెండిని దిగుమతి చేసుకోవాలంటే దిగుమతిదారులు ముందస్తుగా ప్రభుత్వం వద్ద నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు మధ్య కాలంలో దక్షిణ కొరియా నుంచి 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన బంగారం దిగుమతులు చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాయిన్లు, ఆభరణాల రూపంలో అన్ని రకాల బంగారం, వెండి ఉత్పత్తులపై ఈ పరిమితి విధిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. బేసిక్ కస్టమ్ డ్యూటీ లేకుండా దక్షిణ కొరియాకు, భారత్‌కు మధ్య ఉచిత వాణిజ్య ట్రేడ్ జరుగుతోంది. ఉచిత వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులపై 10 శాతం కస్టమ్ డ్యూటీ ఉంది. చైనా తర్వాత ప్రపంచంలో అతిపెద్ద బంగారం వినియోగదారునిగా భారత్ ఉంది. జూలైలో బంగారం దిగుమతులు 95 శాతం పెరిగాయి.



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901,
katuruRavindraTrivikram@gmail.com

పౌరులు–చట్టాలు

## లౌకికత్వంతో అన్నిమతాలకు సమానస్వేచ్ఛ



**25** మనది ప్రజాస్వామ్య లౌకిక దేశం. ఇక్కడ అన్ని మతాల వారికీ సమాన స్వేచ్ఛా హక్కులు ఉన్నాయి. ఏ మతాన్ని ప్రత్యేకంగా ప్రోత్సహించడం, అభివృద్ధి వంటివి చేయకూడదు. ఇందుకు సంబంధించినదే 27వ అధికరణం. దీని ప్రకారం" ఏదైనా ఒక మత సంబంధ ఖర్చులకు, అభివృద్ధి కోసం పన్నులు చెల్లించాలని ఏ వ్యక్తినీ బలవంతం చేయకూడదు." ఇది ప్రభుత్వ అధికారాలకు సరిహద్దు. ఎవరూ దీనిని అతిక్రమించరాదు. ప్రభుత్వానికి మతంతో ఎలాంటి ప్రమేయం ఉండకూడదు. ఇస్లామిక్ దేశాలలో 'ఇస్లాం' మత సంబంధ కార్యక్రమాలు అధికార పూర్వకంగా జరుగుతాయి. నేపాల్ ఒకప్పుడు హిందూ రాజ్యం. అక్కడ రాజు అధికారికంగా హిందు మత సంబంధ కార్యక్రమాలలో పాల్గొనేవారు.

అయితే, మత సంబంధ నిబంధనల్లో ఒక మినహాయింపుఉంది. సాధారణ మతపన్నులు(ఏ మతానికి చెందినవి)వసూలు చేయడానికి అభ్యంతరం లేదు. అయితే ఇది అన్ని మతాలకు సంబంధించి ఉండాలి. అందులోంచి ఏదైనా మతానికి సంబంధించిన ఖర్చులను చెల్లించవచ్చు. అలాగే ధార్మిక, దాన వినియోగ కార్యక్రమాలకు ఈ ధనాన్ని ఉపయోగిం చవచ్చు.

(4) విద్యాసంస్థల్లో కొన్ని మత బోధలు,ప్రార్థన పట్ల స్వేచ్ఛ

28వ అధికరణం ప్రకారం ప్రభుత్వనిధులతో నిర్వహించేబడే ఏ విద్యాలయంలోనూ మతబోధలు చెయ్యకూడదు. అయితే, ఏదైనా ట్రస్టు లేక కానుకగా ఇవ్వబడిన నిధులు లేక ఆస్తిని ప్రభుత్వ నిర్వహిస్తున్న ఎవరు దాని నిర్మాణానికి కారకులో వారి ఆశయాలను సరించి, మత సంబంధ బోధలు ఆవిద్యా సంస్థల్లో చేయవచ్చు. అయితే ఏ వ్యక్తి అయినా ప్రభుత్వనిధుల చేత నిర్వహింపబడుతున్న, ప్రభుత్వం చేత గుర్తింపు విద్యా సంస్థల్లో చదువుతూ ఉండగా, ఈ క్రింది విషయాలకు బద్ధుడుకాడు.....

ఎ) మతబోధల తరగతులకు హాజరు కావడం లేక

బి) మత ప్రార్థనలలో ఆసంస్థ లేక అనుబంధ సంస్థలలో పాల్గొనటం ఇందుకొక మినహాయింపు ఉంది.

ఒక వ్యక్తి మేజరు అయితే లేదా మైనరు అయిన పక్షంలో గార్డియన్ చేతగాని, అంగీకార పత్రం మీద సంతకం చేసిఉంటే హాజరుకావచ్చును.

విద్యా విషయంగా ఒక మతం గురించి చదవటం, ఒక మత ప్రచారం చెయ్యడంలో గల తేడాను మనం స్పష్టంగా గమనించాలి. మొదటిది కేవలం మతవిషయాలు తెల్సుకోవడం, రెండవది, మిత వ్యాప్తిగా ప్రచారంలోకి దిగటం.

బ్రిటిష్‌వారు విద్యాబోధనలో మతాన్ని కూడా చేర్చారు. హిందువులు, ముస్లిములని తేడా లేకుండా ఇంగ్లీషు బోధనా విద్యా సంస్థల్లో బైబిల్ క్లాసులకు హాజరు కావాల్సి వచ్చేది. దీని ప్రభావం వల్ల చాలా మంది మతాలు మారి క్రిస్టియన్లుగా మారిపోయిన సందర్భాలున్నాయి.

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ హిందుమతంలోని కుల వివక్షను, మతహంకారాన్ని వ్యతిరేకించి బౌద్ధాన్ని స్వీకరించారు.

(సశేషం)

## నంద్యాల ముగిసింది..

- కాకినాడపై కన్నేసిన టీడీపీ, వైసీపీ..
- నేడు చంద్రబాబు ప్రచారం!

**కాకినాడ :** సెమీఫైనల్‌గా భావించిన నంద్యాల ఉప ఎన్నిక పోరు ముగియడంతో ఇప్పుడు టీడీపీ, వైసీపీలు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలపైనా అదే స్థాయిలో దృష్టిసారించాయి. గెలుపే ధ్యేయంగా ఇరు పార్టీలు ఉధృతంగాప్రచారం నిర్వహిస్తున్నాయి. సెకెండ్ సెమీస్‌గా భావిస్తూ గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఏడేళ్ల తర్వాత జరుగుతున్న కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పావులు కదుపుతున్నారు. సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ మధ్యాహ్నం మూడు గంటలకు విజయవాడ నుంచి కాకినాడ చేరుకోనున్న చంద్రబాబు రేపు మధ్యాహ్నం వరకు కాకినాడలో ప్రచారం చేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో ఏ పార్టీ విజయం సాధిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ నేపథ్యంలో టీడీపీ, వైసీపీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మరోవైపు వైసీపీ కూడా ఎన్నికల్లో గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. కార్పొరేషన్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎంపీ విజయసాయిరెడ్డి పనిచేస్తున్నారు.

## విజయవాడలో ట్రాఫిక్ కష్టాలు

**రా.వా.ప్రతినిధి,విజయవాడ:** ఏపీ ప్రభుత్వం భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు సన్మానం జరుపడంతో గన్నవరం నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు సుమారు లక్ష మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ర్యాలీ సందర్భంగా గన్నవరం నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. 5వ నంబర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. దీంతో వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బందరు రోడ్‌లోకి వాహనాలు రాకుండా పోలీసులు నిలిపివేశారు.

## వరల్డ్ ఛాంపియన్‌షిప్ సెమీస్‌కు సైనా



**గ్లాస్గో:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సైనా నెహ్వాల్ సెమీస్‌లో అడుగుపెట్టింది. లోకల్ ప్లేయర్, 16వ సీడ్ క్రిస్టీ గిల్‌మోర్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సైనా 21–19, 18–21, 21–15 తేడాతో విజయం సాధించింది. గంట 14 నిమిషాల పాటు జరిగిన ఈ హెూరాహెూరి పోరులో 21–18తో మొదటి గేమ్‌ను గెలిచిన సైనా, 18–21 తేడాతో రెండో గేమ్‌ను కోల్పోయింది. నిర?యాత్మకమైన మూడో గేమ్‌లో 21–15తో సత్తా చాటి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌కు చేరిన సైనాకు పతకం ఖాయమైనట్లే..! అంతకు ముందు తెలుగు తేజం,ఒలంపిక్ పతక విజేత పీవీ సింధు కూడా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్ మ్యాచ్‌లో భారత బ్యాడ్మింటన్ షట్లర్ పీవీ సింధు అద్భుత విజయాన్ని అందుకుంది. ప్రత్యర్థి చైనా షట్లర్ సన్‌యూపై 21–14, 21–9తో సింధు గెలుపొందింది. దీంతో సింధు వరల్డ్ ఛాంపియన్‌షిప్ సెమీస్‌లోకి చేరింది. సెమీస్‌కు చేరిన పీవీ సింధుకు పతకం ఖాయం అయినట్లే.! గతంలో రెండు సార్లు వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం అందుకుంది. తాజాగా సింధుకు మూడో సారి పతకం ఖాయం చేసుకుంది. శనివారం జరిగే సెమీస్‌లో సైనా, సింధులు తమ ప్రత్యర్థులతో మ్యాచ్ ఆడుతారు. ఈ రెండు మ్యాచ్‌ల్లో వీరిద్దరూ విజయం సాధిస్తే.. ఆదివారం జరిగే ఫైనల్‌లో ప్రత్యర్థులుగా తలపడతారు. ఇప్పటికే సెమీస్‌కు చేరిన ఇద్దరు చరిత్ర సృష్టించారు.

## 31న నింగిలో పీఎస్ఎల్‌వీసీ– 39

**సూళ్లూరుపేట :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ నెల 31వ తేదిన ప్రయోగించనున్నారు. ఇందులో ఐఆర్ఎస్ఎస్ఎస్ 1 హెచ్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. ఇది ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్. దీని బరువు 1400 కిలోలు, ఈ ఉపగ్రహానికి సంబంధించి రాకెట్ శిఖర భాగంలో శాటిలైట్‌ను సీట్‌షీల్డ్ లోడ్ చేసే ప్రకియను పూర్తి చేశారు. 31వ తేది సాయంత్రం 6గంటల 59 నిమిషాలకు ప్రయోగ వేదిక నుండి నింగిలోకి పంపనున్నారు. దీనికి సంబంధించి ఎమ్మార్‌ఆర్ సమావేశాన్ని 28వ తేది నిర్వహించనున్నారు. ఆ సమావేశంలో ఇస్రో ఛైర్మన్, మిషన్ డైరెక్టట్, షార్ సంచలకులు కున్హికృష్ణన్ పాల్గొని అనంతరం కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించేందుకు అధికార పూర్వకంగా సమావేశంలో ఒక ఓటటౌస్త్రం నిర్ణయించనున్నారు. ఇందుకు సంబంధించి షార్ మార్గం గుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

# ముస్లిం మహిళా విజయ కేతనం



**చట్టాలను ఎంత పకడ్బంధీగా రూపొందించినప్పటికీ దానిని అమలు చేసేవారు కొరవడినా, లేదా దాన్ని దుర్వినియోగం చేసినా సమాజానికి ప్రయోజనం ఉండబోదని రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్. అంబేద్కర్ తెలిపారు.**

మహిళలు సమాజం నుంచి గుర్తింపు గౌరవం, స్వేచ్ఛ, భద్రతను కోరుకుంటారు. అయితే దేశంలో మహిళలకు పురుషులతోపాటు సరైన ప్రాతినిధ్యం లేదన్నది మాత్రం నిజం.ఎన్నో కలలతో పుట్టింటి నుంచి మెట్టింటికి చేరిన వనితలు సరైన ఆదరణలేక, భద్రత కరువై జీవించాల్సి వస్తోంది. అందుకు ఉదాహరణే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురు మహిళలు షయిరాబానో,ఇశ్రాంత్ జాహన్,అతియా సబ్రి,గుల్షన్ పర్వీన్ ,ఆఫ్రీన్ రెహ్మాన్‌లు.

సుప్రీంకోర్టులో మొదటి పిటిషనర్ షయిరాబానో (36) భర్త దుబాయిలో ఉంటారు. 2015లో ఆమె భర్త లేఖలో ముమ్మారు తలాక్ రాసి విడాకులు పంపారు. ప్రొప్రయిటరీ డీలర్ అయిన ఆయన ఇద్దరు పిల్లలను కూడా దుబాయి తీసుకువెళ్ళారన్నారు. ఆమె అత్తమామలు ఆమెకు 6 అబార్షన్లు చేయించడంతో శారీరంగా, మానసికంగా చాలా ఒత్తిడికి గురయ్యానని ఆవేదన చెందారు.

పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇశ్రాంత్ జాహన్ మాట్లాడుతూ పెళ్లయిన 15ఏళ్లకి ఆమె భర్త దుబాయ్ నుంచి ఫోనులో తగువాడి 3 సార్లు తలాక్ చెప్పి ఫోన్ పెట్టేశారన్నారు. మళ్లీ గ్రామం వచ్చి మరొక అమ్మాయిని పెళ్లి చేసుకొని పిల్లలతో సహా దుబాయ్ వెళ్లిపోయారని వ్యధను వెలిబుచ్చారు. ప్రస్తుతం భర్త ఇంట్లో కరెంటు కూడా లేకుండా ఆమె నివసిస్తోంది.

2012లో పెళ్లయిన అతియా సబ్రికి ఇద్దరూ కూతుర్లే పుట్టారని కొడుకు పుట్టలేదని ఒక చిన్న పేపరుపై ముమ్మారు తలాక్ రాసి భర్త విడాకులిచ్చారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విడాకులిచ్చే

ట్రిపుల్ తలాక్ పద్ధతిని కొంతమంది ఎంత దారుణంగా ఉపయోగిస్తున్నారో తెలిసిందని, విడాకులకు వ్యతిరేకిని కాదని అయితే ఇద్దరూ చర్చించుకునేందుకు అవకాశం ఇవ్వాలని సబ్రి కోరుతున్నారు. విషం తీసుకొని చనిపోవాలనుకున్న ఆమె ఈ పరిస్థితులు తన పిల్లలకు ఉండకూడదనే నిర్ణయంతోనే సుప్రీంకోర్టు మెట్లెక్కానని, సుప్రీం తీర్పుతో సంతోషంగా ఉందన్నారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన పిటిషన్ గుల్షన్ పర్వీన్ మాట్లాడుతూ రూ.10 స్టాంపు పేపర్లపై మూడుసార్లు తలాక్ రాసి ఇచ్చారు. దీంతో ఒక్కసారే రెండేళ్ల కొడుకుతో సహా తలదాచుకుంటానికి చోటు లేకుండా పోయిందని పర్వీన్ కళ్లనీళ్ల పర్యంతమయ్యారు. ఆమె నోటీసు అందుకుంటానికి తిరస్కరిస్తే భర్త ఫ్యామిలీకోర్టు ద్వారా విడాకులు పొందాడని వాపోయారు.

స్పీడు పోస్టులో ట్రిపుల్ తలాక్ అందుకున్న ఆఫ్రీన్ రెహ్మాన్ మాట్లాడుతూ మరింత కట్నం తేవాలని వేధించి, తీవ్రంగా గాయపరచి తన భర్త ఇంటి నుంచి వెళ్లగొట్టారని తెలిపింది. వాట్సప్ స్పీడ్‌పోస్టు,ఫోను, లేఖల ద్వారా ట్రిపుల్‌తలాక్ చెప్పినవారికి మహిళలు బుద్ధిచెప్పారు. ఇకపై తక్షణ విడాకులు లేనందున వీరితో పాటు మరెంతో మంది సుప్రీంకోర్టు తీర్పును స్వాగతం చెబుతున్నారు. వారి కుటుంబాలు గాటపడినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీం తీర్పుపై ముస్లిం సంఘాలు తర్జన భర్జన పడుతున్నాయి. షరియత్ చట్ట ఉల్లంఘనకు పాల్పడటాన్ని అవి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మూడు నెలల్లో మూడుసార్లు తలాక్ చెప్పాల్సి ఉండగా, దీనిపై మతపెద్దలు మౌనాన్ని ఆశ్రయించడం తోనే మహిళలు సుప్రీంకోర్టు మెట్లెక్కారని గుర్తుంచుకోవాలి. అయినా పాకిస్థాన్, దుబాయ్‌తో సహా మరే ఇతర ముస్లిం దేశాల్లో ముమ్మారు తలాక్ చెప్పే వ్యవస్థలేదని గుర్తించాలి.

అభద్రత ఒక్క ముస్లిం మహిళల్లోనే కాదు అన్ని మతాల వారికీ ఉందన్న సత్యాన్ని గుర్తించాలి. ప్రధాని మోడీ పెళ్లిచేసుకొని ఆమె భార్యను పట్టించుకోలేదు. ఆమె పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేసి రిటైర య్యారు. ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతి పొందిన అమర్త్యసేన్ తన భార్యని అర్ధాంతరంగా అమెరికాలో గెంటేస్తే ఆమె పిల్లలతో సహా భారత్ వచ్చారు. జీవన భద్రతకోసం మతాలకు అతీతంగా మహిళలు చేపట్టాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రూపొందించే బిల్లుతోపాటు జోగిని, బసివిని, వెలయాలు, దేవదాసి, మాత వంటి పేర్లతో హిందూమతం చేస్తున్న దాష్టికాలపై పోరాడాలి.

## వినోద సదుపాయలతో
# సచివాలయ భవంతులు

### సెప్టెంబరు 13 నాటికి తుది ఆకృతులు
### సీఎం చంద్రబాబు ఆదేశం



**రా.వా. ప్రతినిధి, అమరావతి :** ప్రపంచస్థాయి ప్రమాణాలతో గూగుల్‌లాంటి ఐటీ కార్పొరేట్ కార్యాలయాలకు ధీటుగా ఏపీ సచివాలయం, శాఖాధిపతుల భవన సముదాయాల నిర్మాణం చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. బుధవారం మధ్యాహ్నం తన నివాసంలో జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమీక్షా సమావేశంలో సచివాలయం, శాఖాధిపతుల భవనాలపై సీఎం చర్చించారు. వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతుల కార్యస్థానాలు ఇప్పటిలా వేర్వేరుగా కాకుండా ఒకే ప్రదేశంలో ఉండాలని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సూచనలకు అనుగుణంగా ఫోస్టర్ అండ్ పార్టనర్స్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి విశ్లేషణాత్మక నివేదిక అందించారు. క్వాలిటీ, ఛాయిస్,ఫ్లెక్సిబిలిటీ తదితర అంశాల కలయికతో వివిధ రకాల ఆప్షన్లతో ఈ నివేదికను రూపొందించారు. లండన్ రాజ ప్రాసాదంలోని ఖజానా పునర్ నిర్మాణ అంశంపై అధ్యయనం చేసి ఈ నివేదిక ఇచ్చారు. ఫోస్టర్ బృందం నివేదికలు, వాటిపై తాను చేసి సూచనలపై త్వరలో ఒక కార్యగోష్టి నిర్వహించి కార్యదర్శులు, మంత్రుల అభిప్రాయాలు సేకరించి, దానికనుగుణంగా మార్పులు చేసి తుది డిజైన్లు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 13కు తుది ఆకృతులు సిద్ధం చేయాలన్నారు. పరిపాలన నగరంలో తలపెట్టిన సచివాలయం, డైరెక్టరేట్లు, కమిషనరేట్ల ఏర్పాటును కేవలం ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ ప్రక్రియగా మాత్రమే చూడకుండా ప్రపంచం మొత్తం గొప్పగా చెప్పుకునే అత్యుత్తమ కార్యభవంతులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. పనిచేసే ఉద్యోగులు, అధికారుల్లో అలసట, వత్తిడి కనిపించని విధంగా కార్యాలయాల్లో సకల సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలంటే ఏళ్ల తరబడి పేరుకుపోయిన ఫైళ్లతో దుమ్ము కొట్టుకుపోయిన చెక్క బీరువాలు, బల్లలు, వైరు కుర్చీలు గుర్తుకు వస్తాయి. అలా కాకుండా ప్రభుత్వ భవంతులు ఇక మీదట ఆధునిక జీవనశైలికి అద్దం పట్టాలి. కొత్త సచివాలయంలో ఎక్కడా భౌతికంగా ఫైల్ అనేదే కనిపించకూడదు. ప్రతి ఫైల్ ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. అధికారులు అవసరమైతే తమ తమ ఇళ్ళ నుంచే ఆన్‌లైన్‌లో ఫైల్ క్లియర్ చేయవచ్చు. కొత్త కార్యాలయాలు అందుకు తగ్గట్టుగా అత్యాధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. 'కొత్త సచివాలయాన్ని చూసి సందర్శకులు, సాధారణ పౌరులు అబ్బురపడాలి. అందుకు తగిన అకర్షణలు ఉండాలని చెప్పారు. విహంగ వీక్షణం చేసినప్పుడు కింద ఉన్న సచివాలయ ప్రాంగణం పచ్చదనం, జల ఆకర్షణలతో ఒక అద్భుతాన్ని చూసిన అనుభూతి కలిగేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తదితరులుపాల్గొన్నారు.

# రైల్వేలో 2 లక్షల ఉద్యోగాలు..

**న్యూఢిల్లీ :** రైలు ప్రమాదాలు, రైల్వే భద్రతపై పెరుగుతున్న ఆందోళన నేపథ్యంలో ఉద్యోగాల కల్పనపై రైల్వేశాఖ దృష్టిపెట్టింది. భారీ ఎత్తున ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని యోచిస్తోంది. ఇందుకోసం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. భదత్రా సంబంధిత ఉద్యోగాలు 16 శాతం ఖాళీగా ఉండటంతో రైల్వే ట్రాక్‌ల నియంత్రణ, పెట్రోలింగ్ కష్టతరంగా ఉండడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించింది. ప్రపంచలోని నాల్గవ అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్ భారతీయ రైల్వే ఇటీవల ప్రమాదాలను తీవ్రంగా పరిగణిస్తోంది. భద్రతా చర్యలను పెంచనుంది. సుమారు 2 లక్షల మందిని నియమించాలని భావిస్తోంది. రాబోయే రోజులలో భద్రత, నిర్వహణ విభాగంలో పోస్టులను భారీఎత్తున భర్తీ చేయనున్నట్టు రైల్వే సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దీంతో రైల్వే ఉద్యోగుల సంఖ్య 15 శాతం మేర పెరగనుంది. దాదాపు 1.5 మిలియన్లకు చేరనుంది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో రైల్వేశాఖ రూ. 15 వేల కోట్ల మేర పెట్టుబడి పెట్టనుంది. 2016 డిసెంబరు నాటి గణాంకాలు ప్రకారం రైల్వే ఉద్యోగాల సంఖ్య 1.3 మిలియన్లు కాగా, గ్రూప్ 'సి', గ్రూప్ 'డి' విభాగాల్లో 2,25,823 ఖాళీలున్నాయి. మూడేళ్లలో ప్రతిఏటా సగటున 115 రైలు ప్రమాదాలు జరగగా కనీసం 650 మంది మృత్యువాత పడ్డారు. వీటిలో అత్యధికం మానవరహిత రైల్వే క్రాసింగ్‌ల వద్దే జరుగుతున్నాయి. ఇదిలావుండగా, ఇటీవల జరిగిన రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వేబోర్డు చైర్మన్ ఎకే మిట్టల్ ఇప్పటికే రాజీనామా చేశారు. రైల్వేమంత్రి సురేష్ ప్రభు కూడా రాజీనామాకు సిద్ధపడడం అయితే ప్రధాని ఆదేశాల మేరకు ఆగివున్నారు.

# సాత్వికాహారంతో ఆరోగ్యం పదిలం

పార్టు 11




Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
B.A.M.S
CHINTALURU AYURVEDA PHARMACY
9032990138/ 9393990138
email:
dr.d.vishwanath@gmail.com


**ఊపిరితిత్తులు :** ఈ ఊపిరితిత్తులు గుండెకు రెండు ప్రక్కలా అమర్చబడి వుంటాయి. ఈ ఊపిరితిత్తుల వ్యాధి రావటానికి కారణం చుట్టలు, సిగరెట్లు, బీడీలు ఎక్కువగా కాల్చటం, మద్యపానం ఎక్కువగా సేవించటం, కట్టెల పొయ్యి (దగ్గర ఎక్కువగా గడపటం, లోపలికి తీసుకునే శ్వాస (వూపిరిని) సరిగ్గా తీసుకోకపోవటం (అంటే దీర్ఘ శ్వాస కాకుండా పొట్టి శ్వాస తీసుకోవటం). వాతావరణం కాలుష్యం ఇలా ఎన్నో కారణాలు వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు మొటిమలు : పాపం ఈ మొటిమలకు ఆడా, మగా తేడా లేదు. ఆడపిల్లలకు 16 సం॥ నుండి 18 సం॥ వయస్సులో మగపిల్లలకు (17 సం॥) వయస్సులో వస్తాయి. ఈ వయస్సులో వీటి తీవ్రత ఎక్కువగా వుంటుంది. 20 నుంచి 25 సం॥ వయసు వచ్చేసరికి 90 శాతం వాటంతట అవే తగ్గిపోతాయి. చర్మం జిడ్డుగా వున్నందువల్ల తెరుచుకున్న నాళాల నుండి బయటకు వచ్చిన సీబమ్ అనే జిగురు పదార్థం చర్మకణాలతో కలిసి పూడుకుపోతుంది. దానివల్ల మొహం మిద చిన్న, చిన్న కురుపులు వస్తాయి. వాటిని మనం గోరుతో గిల్లటంతో అవి పెద్దవై నల్లని, ఎఱ్ఱని మచ్చలుగా ఏర్పడతాయి. గోరు తగలటం వల్ల ఈ మొటిమలుకు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కూడా వచ్చి అవి గుంటలుగా ఏర్పడిపోతాయి.

వీటికి నిరారణ ఏమిటంటే రోజుకి రెండు మూడు సార్లు గోరు వెచ్చని నీటితో మొహాన్ని శుభ్రం చేసుకోవాలి. వీలయినంతవరకు ఎక్కువ రసాయనాలు కలవని ఒకే రకమయిన సబ్బుని వాడటం మంచిది. ఆ తరువాత మెత్తని బట్టతో తుడుచుకోవాలి. నూనె పదార్థాలు, నెయ్యి, స్వీట్స్, మసాలాలు తగ్గించేయాలి. మొహానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.

**ఒబేసిటి (ఊబకాయం) :** ఈ ఊబకాయాన్ని అశ్రద్ధ చేసే ఎన్నో ప్రమాదకరమైన రోగాలు తెస్తుంది. ఇవి చిన్నతనంలో బొద్దుగా అనిపించినా పెద్దయ్యాక కూడా కంటిన్యూ అయితే దానివల్ల అధిక రక్తపోటు (బి.పి) డయాబిటిస్ (షుగర్), హార్ట్ ఎటాక్ (గుండె జబ్బు)లు రావటానికి ఆస్కారం ఎక్కువ.

ఇది అదుపులో వుండాలి అంటే (వరి) అన్నం తక్కువ ; కూరలు, పప్పు, పీచు పదార్థాలు ఎక్కువ తీసుకుంటే మంచిది. చిరుతిళ్ళు, దుంపకూరలు, స్వీట్స్, ఐస్ (కీమ్స్, చాక్లెట్స్, మాంసాహారాలు తగ్గించెయ్యాలి. (వీలయితే తినకుండా వుంటే మంచిది).

అంతేకాకుండా కొన్ని ఆహారాలు తినటంవల్ల రజోగుణం, తమోగుణాలు బాగా పెరుగుతాయి. మన మనస్సులో కలిగే ఆలోచనలు, ఉద్రేకాల వల్ల మాత్రమే అనారోగ్యాలు రావు. మనం తీసుకునే ఆహారం రజోగుణం, తమో గుణం పెంచేదయితే ఒకదానికి ఒకటితోడై రోగాలు




వస్తాయి. మనం (సాత్వికాహారం) తీసుకునే ఆహారం ప్రసాదంలా భావించి స్వీకరిస్తే అది ఒక మంచి ఔషధంలా పనిచేస్తుంది. మనం ప్రతి పనీ క్రమశిక్షణతో చేసినట్టయితే అనారోగ్యం మన దగ్గరకు రాకుండా ఉండటమే కాకుండా వృద్ధాప్య లక్షణాలు కూడా తొందరగా మన దగ్గరికి రావు.

**అధికారంలోకి రావడమే పనిగా పెట్టుకున్న పార్టీలు ప్రజాసమస్యలను గాలికి ఒదిలేశాయి. ఒకసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిలబెట్టుకోవడం, లేదా ఆస్థానాన్ని పదిలపరుచుకుంటానికి నిరంతర యత్నాలు చేస్తున్నారుకాని, ప్రజలకు ప్రాథమిక వసతులు కల్పించడానికి కూడా వారు సమయం కేటాయించడంలేదు. రాఘవ్‌దాస్ ఆసుపత్రి చూస్తే ఎంత దారుణంగా ఉంటుందంటే అసలు అది ఆసుపత్రేనా అని అనుకుంటారు. మురికినీరు, వ్యర్థాలు, పందులు,దోమలు,పందికొక్కులు దుర్గంధం... అసలు మనుష్యులు ఉండే ప్రాంతంగానే అనిపించదు. ఆ పరిసరాల్లో పిల్లలకు వైద్యం, అదీ అరకొర నిధులతో .. ఇదీ పాలకులు ఓటర్లకు ఇచ్చే విలువ...**





## గోరఖ్‌పూర్

# మృత్యుకుహరం

### ఆరేళ్లలో 3 వేల మంది చిన్నారులు బలి

ప్రాణ వాయువు సరఫరా ఆగిపోయి దాదాపు 70 మందికి పైగా చిన్నారులను బలితీసుకున్న బాబా రాఘవ్‌దాస్ ఆసుపత్రి ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోనే అతిపెద్దది. అటువంటి వైద్యకళాశాల ఆసుపత్రిలో సరైన వసతులు లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2012 నుంచి ఇప్పటి వరకూ ఈ ఆసుపత్రిలో దాదాపు 3 వేల మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. యూపీలో మూడు దశాబ్దాలుగా 50 వేల మంది చిన్నారులు కన్నుమూశారు. వారిలో ఎక్కువ మంది మెదడువాపు వ్యాధి బారిన పడి మరణించిన వారే కావడం గమనార్హం.సీఎం యోగి ఆదిత్యనాథ్ నియోజకవర్గమైన గోరఖ్‌పూర్‌లోని ఆసుపత్రుల్లో ఎక్కువగా వైద్యుల కొరత ఉంది. అధిక సంఖ్యలో చిన్నారులు మెదడువాపు వ్యాధిగ్రస్తుల వార్డులోనే చేరుతున్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులకు చికిత్స చేసేందుకు ఈ ఆసుపత్రిని ఓ నోడల్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. అందుకోసం బీఆర్‌డీ మెడికల్ కళాశాల యాజమాన్యం మే నెలలో రూ.37 కోట్ల నిధులు కావాలంటూ రాష్ట్రప్రభుత్వాలు ప్రతిపాదన పంపింది. ఈ నిధుల ద్వారా ఆసుపత్రిలో వార్డుల నిర్వహణ, ఐసీయూ, మందుల సేకరణ, వెంటిలేటర్స్, లేబోరేటరీ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావించింది. ఆ ప్రతిపాదనను యూపీ ప్రభుత్వం కేంద్రానికి పంపించగా అందుకు అంగీకారం తెలుపుతూ నిధులు విడుదల చేస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటికే నిధులు రాలేదని, వాటి కోసం ఎదురు చూస్తున్నామని బీఆర్‌డీకి చెందిన ఓ అధికారి వెల్లడించారు.

**పశ్చిమ బెంగాల్ అప్రమత్తం**

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 70 మందికిపైగా చిన్నారులు మరణించిన ఘటన నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. పశ్చిమ బెంగాల్ వైద్య సేవల కార్పొరేషన్(డబ్ల్యూబీఎంఎస్‌సీ) ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రుల నిర్వహణ, మందుల సరఫరా వ్యవస్థలు, చెల్లింపులకు సంబంధించి తనిఖీలు చేసింది. ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఆస్పత్రులలో వైద్య సదుపాయాలపై తీవ్ర దృష్టి పెట్టారు. గోరఖ్‌పూర్‌లో చోటుచేసుకున్న ఘటన తీవ్ర ఆందోళన విషయం, బకాయిలు చెల్లించని కారణంగా సరఫరాదారు ఆక్సిజన్ నిలిపివేయడంతో అనేక అమాయక ప్రాణాలు కోల్పోవడం దురదృష్టమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**చిన్నారుల కోసం ...**

గోరఖ్‌పూర్ బీఆర్డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ లేని కారణంగా మృత్యుముఖంలోకి వెళుతున్న పిల్లలను రక్షించేందుకు మెదడువాపు వ్యాధి నివారణ విభాగం వైద్య ప్రధానాధికారి డాక్టర్ ఖఫీల్ ఖాన్ అనేక ప్రయత్నాలు చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల వారితో మాట్లాడి ఆక్సిజన్ తెప్పించే ప్రయత్నాలు చేశారు. ఆక్సిజన్ కోసం స్థానిక సరఫరాదారుకు ఈ డాక్టర్ స్వయంగా తన వద్ద ఉన్న నగదును చెల్లించారు. ఆగస్టు 10వ తేదీ రాత్రి ఆస్పత్రి ప్రాంగణంలోని సెంట్రల్ పైప్‌లైన్‌లో సరఫరా తగ్గిన విషయాన్ని గుర్తించడంతో ఆస్పత్రి వర్గాల్లో ఆందోళన నెలకొంది అయితే డాక్టర్ ఖఫీల్ ఖాన్ మాత్రం ఆ సమస్య పరిష్కారానికి మార్గాలు వెతికారు. బకాయిలు చెల్లించనిదే ఆక్సిజన్ అవసరమైన నేపథ్యంలో పరిస్థితిని గుర్తించిన ఖన్ ప్రైవేటు ఆస్పత్రుల వారిని అదనపు సిలిండర్ల కోసం ప్రయత్నాలు చేశారు. నాలుగుసార్లుగా 12 ఆక్సిజన్ సిలిండర్లను ఆయన సేకరించారు. నగదు చెల్లింపుపై సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని స్థానిక సరఫరాదారుకు తెలియజేశారు కూడా మరింత ఆక్సిజన్ కోసం డాక్టర్ ఖాన్ తన సొంత డబ్బును చెల్లించినట్లు డీఎన్‌ఏ వార్తా సంస్థ తెలుపుతూ, సిలిండర్ల రవాణాకయ్యే ఖర్చును కూడా ఆ వైద్యుడే చెల్లించినట్లు వివరించింది.

**అది ఊచకోతే కైలాష్ సత్యర్థి**

ఆక్సిజన్ అందక గోరఖ్‌పూరకు చెందిన బాబా రాఘవ్ దాస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో 70 మందికిపైగా చిన్నారులు మరణించిన ఘటనపై నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యర్థి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'ఇది విషాదం కాదు..స్పష్టంగా జరిగిన ఊచకోత' అని ఆయన పేర్కొన్నారు.'70 సంవత్సరాల స్వాతంత్ర్యం అంటే మన పిల్లలకు చెప్పే అర్థం ఇదేనా?' అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సత్యర్థి ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

## పాలకుల నిలివెత్తు నిర్లక్ష్యం

మతహంకారంతో రాక్షసానందాన్ని పొందుతున్న ప్రభుత్వం పేదపిల్లల వైద్యంపట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గోరఖ్‌పూర్ ఆస్పత్రి విషాద ఘటన,అక్కడే కాదు, దేశంలో పసికందుల ఆరోగ్యం గాలిలో దీపంలా తయారైంది. జరిగిన తప్పదాన్ని సరిదిద్దడానికి ప్రయత్నించడానికి బదులు నిస్సిగ్గుగా సమర్థించుకోవడం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ వైఖరిని, వ్యక్తిత్వాన్ని చాటుతోంది. గోరఖ్‌పూర్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న రిఫరల్ ఆస్పత్రిలో ఈనెల 7 నుంచి 12 తేదీల మధ్య చికిత్స పొందుతున్న 124 మందికిపైగా పిల్లల మృత్యువాతపడిన వార్త తెలిసి దేశం తీవ్ర దిగ్భ్రాంతి చెందింది. ముఖ్యమంత్రి ఆస్పత్రిని సందర్శించి వెళ్లిన తరువాత కూడా ఈ ఘటన జరిగిందంటే రాష్ట్రం ప్రభుత్వ పాలనా వ్యవస్థ జవాబుదారీతనం ఏమిటో తేటతెల్లమవుతోంది. పిల్లల మృతివార్తపై ఆదిత్యనాథ్ వ్యాఖ్యానిస్తూ ఈ ఘటనకు ఆక్సిజన్‌కు సంబంధంలేదన్నారు. వాస్తవాన్ని కప్పిపెట్టేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నించడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అంతేకాదు, పారిశుద్ధ్యం సక్రమంగా లేనందువల్లే ఈ ఘటన చోటుచుసుకున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ఆయన బాధ్యతారాహిత్యానికి ప్రతిబింబం. ప్రతి ఏడాది వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో మెదడువ్యాపువాధిపై మాట్లాడే యోగీ రాష్ట్రపాలనాధికారాన్ని చేపట్టిన తర్వాత వ్యవహరించే తీరు ఇదేనా అని ప్రజలు వాపోతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడిచినా నిరక్షరాస్యత, పేదరికం, వ్యాధులు, అనారోగ్యం పారిశుద్ధ్యలేమిలాంటి తీవ్ర అంశాలనుంచి ప్రజలకు ఇంకా స్వాతంత్ర్యం లభించేలేదని ఘోరక్‌పూర్ ఘటన గుర్తు చేస్తోంది.

## ఆస్పత్రి దుస్థితిపై హెచ్చరించిన కాగ్

దేశంలో పాలనాపరమైన వైఫల్యాలను, సేవా వ్యవస్థల్లో లోపాలను ఎప్పటికపుడు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) కడిగిపారేస్తున్నా వ్యవస్థీకృత లోపాలు కొనసాగుతూనే ఉన్నాయి. అందుకు ఉదాహరణే ఉత్తరప్రదేశ్‌కు చెందిన గోరఖ్‌పూర్‌లోని బీఆర్డీ అస్పత్రిలో ఐదు రోజుల్లో 73 మందికిపైగా చిన్నారులు మృత్యువాత. బీఆర్డీ ఆస్పత్రికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనలో అంతరాలను జూన్ నెలలోనే కాగ్ ఎత్తిచూపింది. శిక్షణ పొందిన సిబ్బంది లేకపోవడంతో ఆ వైద్య పరికరాలు మూలనపడ్డాయని, రాష్ట్రంలోని వైద్య కళాశాలలు, వాటి బోధనాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు అందుబాటుల్లో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని నివేదికలో వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్వహణను మెరుగుపరచాలని కోరింది. ఫలితంగా నిధుల విడుదలలో జాప్యం చోటుచేసుకుందని కాగ్ వెల్లడించింది. అంతేకాకుండా సరైన సమయంలో అవసరమైన పరికరాలను సేకరించడంఓ కూడా విఫలమైనట్లు నివేదిక తెలిసింది. ఆస్పత్రికి తగిన నిధులు విడుదలైనప్పటికీ భారత వైద్య మండలి కనీస అవసరాల కోసం సూచించిన వాటికి విరుద్ధంగా రూ.70 లక్షల బకాయిలు చెల్లించడంతో నాన్- క్లినికల్ పరికరాలతో సహా ఆక్సిజన్ సరఫరా తగ్గించబడినట్లు ఆరోపణలు వచ్చాయని ఆడిట్ నివేదిక పేర్కొంది.

## రక్తసిక్తమవుతున్న రైల్వే ట్రాక్‌లు

ప్రధాని, ముఖ్యమంత్రులు బుల్లెట్ రైళ్లు గురించి ప్రసంగిస్తూ సామాన్యరైళ్లలోని ప్రయాణీకుల భద్రతలను గాలికి ఒదిలేస్తున్నారు. అమెరికా, రష్యా, చైనాల తర్వాత భారత్‌తే అతిపెద్ద రైల్వే వ్యవస్థ అయితే ఆధునీకరణ, భద్రత పరిరక్షణ విషయంలో మాత్రం మనం ఎంతగానో వెనుకబడ్డాం. అభివృద్ధి చెందిన దేశాల్లో పోటీపోటీగా రైల్వే వ్యవస్థ రాణిస్తుంటే భారత్‌మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడగా ఉంది. 70 ఏళ్ల క్రిందట కేవలం 27 వేల కిలోమీటర్ల మేరకు ఉన్న చైనా రైల్వేలు నేడు లక్షా 10 వేల కిలోమీటర్లకు విస్తరించింది. స్వాతంత్ర్యం పొందేనాటికే చైనాకు రెండింతలు ఉన్న భారత రైల్వే వ్యవస్థ ఇన్నేళ్లలో విస్తరించింది కేవలం 11 వేల కిలోమీటర్లు మాత్రమే. ప్రగతి పథాన నడవల్సిన రైల్వేలు ప్రభుత్వాల మూలంగా దైన్య స్థితిలో ఉంటూ రానున్న రోజుల్లో ప్రైవేటు పరం కానుంది.

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలోని కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 23 మంది ప్రాణాలు కోల్పోగా మరో 156 మంది క్షతగాత్రులయ్యారు. ఈ దారుణం నుంచి ప్రజలు కోలుకోకముందే రైల్వే పనికోసం నిర్మాణ సామగ్రిని తీసుకెళుతున్న టిప్పర్‌ను కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని 100 మంది ప్రయాణీకులు గాయపడగా, 9బోగీలు పట్టాలు తప్పాయి. రైలు ఆజామ్‌గఢ్‌నుంచి ఢిల్లీ వెళుతుండగా పాట్నా-అచలదా రైల్వేస్టేషన్ల మధ్య అర్ధరాత్రి 2.50 నిమిషాలకు టిప్పర్‌ను ఢీకొటిందని తెలుస్తోంది. గాయపడినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. కళింగ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న మార్గంలో వర్షాలకు పాడయిన ట్రాక్‌లను అనధికారంగా బాగుచేయడమే ఈ దుర్ఘటనకు కారణంగా తెలుస్తోంది.

### ప్రైవేటు దిశగా రైల్లేలు



2016లో రైల్వే సురక్ష, భద్రతలపై సదీప్ బందోపాధ్యాయ నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయిసంఘం ఇచ్చిన నివేదిక అరకొర నిధులతో రైల్వే భద్రత గాలిలో దీపంగా మారిందని పేర్కొంది. అవసరాలకు అనుగుణంగా నెట్‌వర్క్ పరిధిని పెంచడంలో పూర్తిగా నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా విమర్శించింది. రైల్వే వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భద్రతకు పూచీదారులే అని 2012తో నియమించిన డాక్టర్ అనిల్ కాకోద్కర్ కమిటీ పేర్కొంది. కూడుకట్టిన భద్రతా లోపాలవల్లే రైల్వే ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయని కంప్ట్రోలర్ అండ్ ఆటిట్ జనరల్ (కాగ్) పేర్కొంది. మానవ తప్పిదాలవల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించింది. కాపలాలేని క్రాసింగులు, ఆధునీకరణకు నోచుకోని సిగ్నలింగ్ వ్యవస్థలు, పాతబడిన వంతెనలు, భద్రతా వ్యవస్థలో కీలకమైన పోస్టుల్లో ఉద్యోగ నియామకాలు జరపకపోవడం , పర్యరక్షణ కొరత భద్రతా వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. భద్రతా వ్యవస్థలో ఇప్పటివరకు 1.42 లక్షల పోస్టులు ఖాళీలున్నాయి. దీంతో ప్రస్తుత సిబ్బందిపై ఒత్తిడి తీవ్రంగా ఉంది.రైల్వేల్లో ఔట్‌సోర్సింగ్‌కూడా ఇందుకు కారణమే.

కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉన్నప్పటికీ ప్రయాణీకుల మరణాలు చోటుచేసుకోకపోవడానికి కారణం జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన బోగీలు లింక్ హాఫ్‌మెన్ బుష్ (ఎల్ హెచ్‌బీ) బోగీలు కారణంగా తెలుస్తోంది. వీటిని 1999లో భారత్ దిగుమతి చేసుకుంది. త్వరలో వీటిని అన్ని జోన్లలో ప్రవేశపెట్టాలని ప్రజలు ఆశిస్తున్నారు.

కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం జరిగిన వెంటనే రైల్వేమంత్రి సురేష్‌ప్రభు రాజీనామాకు సిద్ధపడగా, ప్రధానిమోడీ వారించారని ఆయన తెలిపారు. అయితే 1956లో మద్రాసుకు 174 కి.మీ దూరంలోని అరియాపూర్ రైల్వే ప్రమాదంలో 152 మంది మృతి చెందడంతో నాటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి రాజీనామా చేశారు. 1999లో పశ్చిమ బెంగాల్‌లోని గైసల్ వద్ద 290 మంది మృతి చెందడంతో నాటి రైల్వే మంత్రి నితీశ్ కుమార్ రాజీనామా చేశారు. మరో రైల్వే ప్రమాదంలో మమతాబెనర్జీ రాజీనామా చేయగా నాటి ప్రధాని వాజ్‌పేయి రాజీనామాను తిరస్కరించారు.

– ఖాన్

# తీర్పుతో విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

అనుచర గణం చేస్తున్న అకృత్యాలకు పంజాబ్, హర్యానా హైకోర్టులు తీవ్రంగా స్పందించాయి. ఆయన ఆస్తున స్వాధీనం చేసుకొని విధ్వంసమైన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల నష్టపరిహారం చెల్లించాలని వెంటనే తీర్పులు వెలువరించాయి. డేరాకు చెందన 36 ఆశ్రమాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

డేరా అల్లరి మూకలు రైల్వేస్టేషన్‌కు నిప్పంటించారు. అగర్తలా ఎక్స్‌ప్రెస్‌కులోని రెండు బోగీలకు నిప్పంటించారు. పెట్రోలు బంకులు, వాహనాలు తగులబెట్టారు.తీర్పు వెలువడిన వెంటనే రేప్‌బాబాను హెలికాప్టర్‌లో రోహ్‌తగ్ తరలించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో 200 పైగా రైళ్లు, బస్సులు ఆగిపోయి, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఢిల్లీకి పాకిన అల్లర్లలో కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది, బీఎస్ఎఫ్ జవాన్లను మోహరించింది. నోయిడా, ఘజియాబాద్‌తో సహా చాలా ప్రాంతాల్లో 144సెక్షన్ అమలు చేస్తోంది. డేరా బాబా ప్రైవేటు సైన్యం చేతిలో ప్రభుత్వ పాల ఉత్పత్తి కేంద్రం, 100 కార్లు, 2 పంజాబ్ రాష్ట్ర రవాణా బస్సులు అగ్నికి అహుతయ్యాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా హర్యానా హైకోర్టు ఈ నెల 18నే సమస్యాత్మక ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించాలని పోలీసులను కోరింది. ఇంతటి విధ్వంసానికి కారణమైన పోలీసులను హైకోర్టు నిలదీయగా, మర్చిపోయామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.పంజాబ్‌లోని మన్సా, హర్యానాలోని పంచకులల్లో విధ్వంసం పరాకాష్టకు చేరుకుంది. ముష్కరులు అగ్నిమాప వాహనానికి కూడా నిప్పంటించారు.

**ఖట్టర్‌కు బాసటగా రాజ్‌నాథ్ సింగ్**

ఇంతటి విధ్వంసానికి కారణమైన హర్యానాలోని బీజేపీ ముఖ్యమంత్రి ఖట్టర్‌కు హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బాసటగా నిలిచారు. ప్రభుత్వం తప్పేమిలేదన్నారు. శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అయితే వారం రోజుల క్రితం కేరళాలో ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్యకు గురవడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఆరాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌తో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగితే రాష్ట్రపతిపాలన విధించాల్సి ఉంటుందని వామపక్ష ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించిన విషయం తెలిసిందే. ఒక్క హత్యకే ఆ రాష్ట్ర మంత్రి వర్గాన్ని తప్పుబట్టిన హోంమంత్రి ఇప్పుడు ఏడుగురు మహిళలతో పాటు 32 మంది మృతికి, మరో 350 మంది గాయాలపాలైనా ఆ ప్రభుత్వానికి బాసటగా నిలవడం ప్రజలకు తీవ్ర మనోవేధన కలిగిస్తోంది.

**28న శిక్ష ఖరారు**

ఈనెల 28న గుర్మీత్ సింగ్‌కు సీబీఐ కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. బేటీ బచావో అనే నినాదం ఇచ్చిన మోడీ ప్రభుత్వం అత్యాచార బాధితురాలికి ఉపశమనం కలిగించలేకపోతోందని ప్రతిపక్షాలు, రాజకీయ పండితులు, హేతువాదులు కేంద్రాన్ని దునుమాడుతున్నాయి. రోడ్లపై ప్రయాణిస్తున్న పిల్లలు, మహిళలకు రక్షణ కల్పించడంలో హర్యానా ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శించిందని మీడియా దునుమాడుతోంది. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ విచ్చిన్న కరశక్తులు గుమిగూడినా ప్రభుత్వం పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంపై పంజాబ్, హర్యానా హైకోర్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.





**సాక్షిమహరాజ్ ప్రేలాపనలు**

బీజేపీ ఎంపీ, కరడుకట్టిన హిందుత్వవాది సాక్షి మహరాజ్ మాట్లాడుతూ గుర్మీత్ సింగ్ మహాత్ముడని 5 కోట్ల ప్రజలు ఆయన వెనకు ఉన్నారని, సీబీఐ కోర్టు తీర్పు కుట్రతో కూదురకుందని దేరాబాబాకు వంతపాడటం దేశవాసులకు ఆగ్రహం కలిగిస్తోంది.

**గుర్మీర్‌సింగ్ జీవితం**

రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లా శ్రీగురుసర్ మోడీ గ్రామంలో నసీంబ్‌కౌర్ , మఘర్ సింగ్ దంపతులకు 1967 ఆగస్టు 15న గుర్మీత్ సింగ్ జన్మించారు. హర్జీత్‌కౌర్‌తో ఆయన వివాహం జరిగింది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 1990లో దేరా సచ్చసౌదా సంస్థను ప్రారంభించారు.



**సేవా కార్యక్రమాలు**

బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందిస్తారు. అంతేకాకుండా ప్రధానిమోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో మోడీతో పాల్గొన్నారు. రక్తదానం, చెట్లునాటడం, ప్రకృతి విలయాలకు సహాయకార్యక్రమాలు చేపట్టడం, హిజ్రాల స్వావలంబనకు కృషిచేయడం, ఆదివాసీల పునరావాసం, అనాధుల సంరక్షణ, సెక్స్ వర్కర్లకు పునరావాస చర్యలు చేపట్టి గిన్నీస్ రికార్డు ఆఫ్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. ఈయన చేసిన కృషికి ఇంగ్లండ్ వర్సిటీ ఆయనను సత్కరించింది. భారతదేశంలోని 100 మంది శక్తిమంతుల్లో 96వ వాడిగా 2015లో ఆయనకు గుర్తింపు వచ్చింది. అయితే మొదటి నుంచి వివాదాస్పదుడైన ఆయన 10వ సిక్కుగురు గోవింద్‌సింగ్‌ను నేనంటూ ఆయనలా వ్యవహరించడంతో సిక్కు ప్రజలు సంస్థల ఆగ్రహానికి గురయ్యారు. దాంతో ఆయన క్షమాపణలు కోరాల్సి వచ్చింది. ఆయనపై కథనాలను ప్రచురిస్తున్నారని జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతిని హత్యచేయించారన్న కేసు నడుస్తోంది. ధార్మిక సంస్థలపేరుతో సొంతసైన్యాన్ని ఏర్పాటు చేయడం అల్లరిమూకలను భక్తులుగా, అనుచరులుగా చేసుకోవడం,వారికి రాజకీయా నాయకులు అండదండలు అందించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడంపట్ల కోర్టులు, ప్రజలు, హేతువాదులు , రాజనీతి కోవిదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అత్యాచార కేసు**

2002లో దేరా సచ్చసౌదాకు చెందిన సాధ్విని, ఆమె అనుచరులపై దేరాబాబా అత్యాచారం జరిపారని, అటల్‌బిహారీ వాజ్‌పేయికి లేఖ అందింది. ఈ లేఖను సుమోటోగా తీసుకున్న పంజాబ్, హర్యానా హైకోర్టులు సీబీఐ దర్యాప్తుకు ఆదేశించడంతో 2007లో సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. 15 ఏళ్ల సుదీర్ఘ సీబీఐ దర్యాప్తు అనంతరం అత్యాచారం జరిపిన దోషిగా బాబాను శుక్రవారం కోర్టు ధృవీకరించడంతో ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది.

**చిత్రపరిశ్రమలో బాబా**

ఎంఎస్‌జీ ( మెసెంజర్ ఆఫ్ గాడ్ )1,2 సినిమాలకు నటుడు, సంగీతకారుడు, రచయిత, దర్శకత్వం చేపట్టారు. ఆ సినిమాకు భారత ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. దానికి క్లీన్ చిట్ ఇవ్వాల్సిందిగా ఒత్తిడి తేవడంతో కేంద్ర సెన్సారు బోర్డు మాజీ చైర్మన్ లీలా శాంసన్ రాజీనామా చేశారు. ఆయనతోపాటు మరో సభ్యుడు భాస్కర్‌కూడా రాజీనామ చేశారు.

**రాష్ట్రపతి పిలుపు**

ప్రజలంతా సంయమనం పాటించాలని, శాంతిభద్రతలు పునరుద్దరణకు సహకరించాలని శుక్రవారం రాత్రి రాష్ట్రపతి ప్రజలకు పిలుపు నిచ్చారు.

**ప్రధాని మోడీ**

అల్లర్లలో 32 మంది మృతి చెందడం, 350 మంది గాయపడటం తననెంతో బాధించిందని పరిస్థితిని అదుపులోకి తేవడానికి పోలీసులు 24× 7 కృషి చేయాలని పోలీసులకు ఆదేశించారు. సైన్యం, బీఎస్ఎఫ్, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్‌లను రంగంలోకి దించామన్నారు.







# ఈస్ట్ ఇండియా సైనిక బలగాల్ని ఎదుర్కొన్న భక్త్‌ఖాన్

**ముహమ్మద్ భక్త్ ఖాన్ (1859)**

11 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక బలగాలను ఏకోన్ముఖంగా ఎదుర్కొనగల సమర్థుడి అవసరాన్ని తీర్చి ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామ వీరుల సర్వసేనానిగా బాధ్యతలు నిర్వర్తించిన ముహమ్మద్ భక్త్ ఖాన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలోని సుల్తాన్‌పూర్‌లో జన్మించారు. బ్రిటిష్ సైన్యంలో 40 ఏండ్ల సుదీర్ఘ అనుభవాన్ని సొంతం చేసుకున్న ఆయన 1857లో రోహిల్ ఖండ్‌లో ఖాన్ బహుదూర్ ఖాన్ నేతృత్వంలో సాగిన పోరాటంలో ఆంగ్ల సైన్యాలను పరాజితుల్ని చేశారు. ఆ తరువాత బరెల్లీలోని ఈస్ట్ ఇండియా కంపెనీ ఖజానాను స్వాధీనం చేసుకుని, మరిన్ని సైనిక బలగాలను సమకూర్చుకున్న భక్త్ ఖాన్ తన బలగాలు, ఖజానాతో ఢిల్లీ చేరుకున్నారు. మొగల్ చక్రవర్తి బహదూర్ షాహ్ జఫర్ ఆయనను స్వదేశీ సైనికులకు సర్వ సైనాధిపతిగా నియమించగానే సైనిక బలగాల పరిస్థితులను చక్కదిద్దారు. ఢిల్లీ నగరంలోని వ్యవహారాలను చక్కదిద్దాక పరిపాలన వైపు దృష్టి సారించిన ఆయన ప్రజాస్వామిక పద్ధతులకు శ్రీకారం చుట్టి 'మహాపరిపాలనా మండలి' ఏర్పరిచారు. ప్రత్యేక నగర పాలనకు రాజ్యాంగ విధానాన్ని' రూపొందించారు. స్వతంత్ర్య పాలనకు, వ్యక్తుల మధ్యన భేదాభిప్రాయాలు, స్వార్థం అంటరాదన్న ముందు చూపుతో చక్కని రాజనీతిజ్ఞతను ప్రదర్శించారు. ఢిల్లీలో ఆంగ్ల సైన్యాల మీద సాధించిన విజయంతో స్వదేశీ



సైనికులు సరిపెట్టుకుని స్థిమిత పడితే లాభం లేదని భావించే ఢిల్లీ పరిసర ప్రాంతాలలోని సంస్థానాలలో కూడా బ్రిటిషర్ల పెత్తనాన్ని పూర్తిగా అంతం చేయాలన్నారు. ఆ దిశగా భక్త్‌ఖాన్ ప్రయత్నాలు చేస్తుండగా మొగల్ రాకుమారులు, రాజకుటుంబీకులు, వాణిజ్య ప్రముఖులు ఆయన మీద చక్రవర్తికి పితూరీలు చెప్పడంతో ఏర్పడిన అవాంఛనీయ పరిస్థితులను అర్థం చేసుకున్నారు. భక్త్‌ఖాన్ స్వచ్ఛందంగా సర్వసైన్యాధిపతి స్థానం నుండి తప్పుకున్నారు. స్వంత సైనికబలగాల అధినేతగా కంపెనీ సైనికుల మీద సాగిన పోరాటాలలో ఆయన పాల్గొన్నారు. చివరకు ఢిల్లీ పరాజయం తప్పదని తేలిపోగా చక్రవర్తి బహదుర్ షాహ్ జఫర్‌ను కలిసి. తనతోపాటుగా అయోధ్యకు రావాల్సిందిగా కోరారు. చెప్పుడు మాటల వలస చక్రవర్తికి భక్త్‌ఖాన్ సలహా రుచించలేదు. ఢిల్లీ ఆంగ్లేయుల వశం కాగానే భక్త్‌ఖాన్ అయోధ్యకు వెళ్ళిపోయారు. అక్కడ ఆంగ్లేయులతో పోరాడుతున్న లక్నో మహారాణి బేగం హజరత్ మహల్ సైన్యంతో కలసి ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులతో సాగిన పోరాటాల్లో ఆయన పాల్గొన్నారు. చివరకు లక్నో పరాజయం తరువాత బేగం హజరత్ మహల్‌తో కలిసి నేపాల్ పర్వత ప్రాంతాలలోకి తప్పించుకున్నారు. ఆంగ్లేయుల మిద పోరుకు మళ్ళీ సన్నాహాలు ఆరంభించారు. నేపాల్ అధినేత జంగ్ బహుదూర్ సహాయ నిరాకరణ వలన అవి సఫలం కాలేదు. అద్వితీయ కార్యదక్షత, రాజనీతిజ్ఞత, దార్శనికత ప్రజాస్వామిక దృష్టి, ధైర్యసాహసాలను ప్రదర్శించి, ప్రథమ స్వాతంత్ర్యసమరం పోరాట యోధుడిగా శత్రువు చేత కూడా శభాష్ అన్పించుకున్న మహమ్మద్ భక్త్ ఖాన్ ఊపిరి ఉన్నంత వరకు ఆంగ్లేయులతో పోరాడుతూ 1859 మే 13 న కదనరంగంలో నేలకొరిగారు.

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**


**Syed Naseer Ahamed**
Mobile: 9440241727.
E-mail: naseerahamedsyed@gmail.com

# మన కోసం

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |

**రెస్టారెంట్స్**

| | | | |
|---|---|---|---|
| బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |

**షాప్స్**

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్వి. పున్నారావు | 9848407935 |
| చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |

**ట్రేడర్స్**

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |

# పర్యాటక రాజధాని..ఆహ్లాద అమరావతి



- వినోదాల హరివిల్లుగా శాఖమూరు పార్కు
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భవానీద్వీపం

**రా.వా ప్రతినిధి, అమరావతి :** అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రజా రాజధానిగా నిర్మిస్తున్న అమరావతిలో ఉల్లాసం. వినోదం అందించే దిశగా ప్రభుత్వం కసరత్తులు ముమ్మరం చేసింది. ఆరోగ్యకరమైన జీవర విధానాన్ని రాజధానిలో కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తుంది. ఆనంద నిలయంగా రాజధాని అమరావతిని తీర్చిదిద్దేందుకు నడుంబిగించింది. అందులో భాగంగా ముందుగా ప్రకటించిన విధంగానే 29 గ్రామాలలో ఒకటైన శాఖమూరులో అందమైన ఉద్యానవనం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. అన్ని వయస్సుల వారికి ఆటవిడుపు అందించడంతో పాటుగా వినోదం కలిగించే విధంగా సంస్కృతి వారసత్వానికి చిహ్నంగా ఈ శాఖమూరు పార్కును ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు జోన్లుగా రూపందించే ఉద్యానవనం కోసం 241 ఎకరాలు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతఅభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీసీఆర్‌డీఏ) ఈ ఉద్యానవనం ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 241 ఎకరాలలో మొదటి జోన్‌కు 85 ఎకరాలు 2వ జోన్‌కు 34 ఎకరాలు, 3వ జోన్‌కు 49 ఎకరాలు అంబేద్కర్ పార్క్ ఏర్పాటు చేసే నాలుగవ జోన్ 73 ఎకరాలు కేటాయించారు. మొదటి 4 జోన్‌లో 46 ఎకరాలలో ఎమ్యుజ్‌మెంట్ పార్కు పది ఎకరాలలో క్రాఫ్ట్ బజార్, ఆరు ఎకరాలలో ఈవెంట్ ఏరీనా, 23 ఎకరాలలో రిసార్ట్సు నిర్మించనున్నారు. సీఆర్‌డీఏ ఇప్పటికే పూర్తి స్థాయిలో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు తనదైన శైలిలో ముందుకు సాగుతుంది. అమరావతి అభివృద్ధి సంస్థతో కలిసి ఉద్యానవనం ఏర్పాటులో ఆశావాహులైన వారితో సమీక్షలు నిర్వహిస్తుంది. ఇదే క్రమంలో రాజధాని అమరావతిలో కృష్ణమ్మ చెంతనే కొలువుదీరిన భవానీ ఐలాండ్‌కి నూతన సోయగాలు తీర్చిదిద్దేందుకు సన్నాహాలు ప్రారంభించారు. పర్యాటక కేంద్రంగా భవానీ ద్వీపాన్ని రూపొందించి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అందాలు అద్దేందుకు బృహత్తర ప్రణాళికలు రచిస్తున్నారు. 150 ఎకరాలలో కొలువుదీరిన భవానీ ద్వీపంలో ప్రస్తుతం 24 కాటేజీలు మాత్రమే ఉన్నాయి. ద్వీపంకి అభివృద్ధి అందాలు అందించాలనే లక్ష్యంగా భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ పేరిట ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ద్వీపాన్ని అభివృద్ధి చేసి రాజధానికి నూతన సోయగాన్ని తీసుకురానున్నారు. ప్రపంచస్థాయి రాజధానిలో అన్ని రకాలు ఏర్పాట్లు చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఇదే క్రమంలో రాజధానిలో పచ్చదనానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్,బ్లూ నినాదాన్ని అనుసరిస్తూ నిర్మాణాలు చేపట్టాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది.

**శాఖమూరు ఉద్యానవనం రాజధానికి ప్రత్యేకం**

నాలుగు జోన్లుగా రూపొందుతున్న ఉద్యానవనం రాజధానికే తలమానికంగా ఉండనుంది. 241 ఏకరాలలో నిర్మితమయ్యే ఈ పర్యాటక కేంద్రంలో క్రాఫ్ట్ బజార్ ఏర్పాటు ద్వారా హస్తకళల అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు ప్రధాన్యత ఇచ్చారు. రాష్ట్రంలోపి అన్ని రకాల హస్తకళలతాలూఉ అద్భుతాలు ఇక్కడ ప్రదర్శించే ఏర్పాటు చేయనున్నారు.2 వ జోన్‌లో పూర్తిగా చిన్నపిల్లలకు ఆనందాన్ని పంచేదిగా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన పార్కులలోని పలు అంశాలని పరిగణలోనికి తీసుకుని ఈ పార్కును ఆకర్షణీయంగా ఏర్పాటు చేయనున్నారు. ఇక 3వ జోన్‌లో నక్షత్ర, చరక్, రాశీ, పుష్పవనాలు ఉంటాయి. ఐదు ఎకరాలలో చరక్, వనం, రాశివనం, రెండు ఎకరాలలో పుష్ప, కాక్టస్ వనాలు ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ జోన్‌లోనే కొంత భాగం వన్యప్రాణుల కోసం కేటాయించారు. నైట్ సఫారీల సంక్షేమార్థం ప్రత్యేకమైన పార్క్‌ను జూరాంగ్ పార్క్ తరహాలో ఏర్పాటు చేసే ఆలోచనలో అమరావతి అభివృద్ధి సంస్థ ఉంది. పాదచారుల కోసం ఆకట్టుకునే రీతిలో ప్రత్యేక వంతెన నిర్మాణంతో పాటుగా యోగ ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేయానున్నారు.4వ జోన్‌లో ఐదు నక్షత్రాల హోటళ్ళు, శిల్ప కళాకేంద్రం, క్లబ్ హౌస్‌ల వంటివి రానున్నాయి. సాంస్కృతిక పురావస్తుశాల, ప్రదర్శనశాలకి ఈ జోన్‌లో పెద్దపీట వేయనున్నారు. అతిపెద్ద అమ్యూజ్‌మెంట్ పార్క్‌గా ఈ ఉద్యానవనాన్ని తీర్చిదిద్ది పర్యాటక అమరావతిగా రాజధానిని రూపొందిస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు నిర్వహించిన ఏడీసీ పర్యాటక ప్రాంతాన్ని రాజధానివాసులకి అందించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వినోదాలు పంచే హరివిల్లుగా శాఖమూరు ఉద్యానవనం రాజధాని వాసులని అలరించనుంది. అయితే అధికశాతం మధ్యతరగతి ప్రజలే ఉన్న రాజధాని ప్రాంతంలో ఈ వినోదాల జల్లు అందరికి అందుబాటులో ఉండేలా నిర్మించాలని రాజధాని వాసులు కోరుకుంటున్నారు.

# జీఓ 14 ను రద్దు చేయకంటే ఉద్యమం

**తెలుగు భాషోద్యమ సమాఖ్య హెచ్చరిక**

**రా.వా.ప్రతినిధి– విజయవాడ :** ప్రథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తొలగిస్తూ విడుదల చేసిన జీవో నెంబరు 14ను తక్షణమే రద్దు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని తెలుగు భాషోద్యమ సమాఖ్య స్పష్టం చేసింది. ఈమేరకు అధికారిక ఉత్తర్వులను ఈనెల 29న జరిగే తెలుగు భాషాదినోత్సవం నాటికి ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిపాలనను పూర్తిగా ప్రజలభాష తెలుగులోకి తీసుకు రావడమే కాకుండా తన కార్యాలయం నుంచే ప్రారంభయ్యే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయంలో సమావేశంలో మాతృభాషామాధ్యమ ఉద్యమనేత, ఎమ్మెల్సీ విళపు బాలసుబ్రహ్మణ్యం, సమాఖ్య అధ్యక్షుడు డిక్టర్ సామల రమేష్‌బాబు మాట్లాడారు. రాష్ట్ర విభజనాంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు భాషాభివృద్ధి కోసం చేసిన వాగ్దానాలలో ఏ ఒక్కటి ఇంత వరకూ అమలుకు నోచుకోలేదన్నారు.గతేడాది జరిగిన తెలుగుభాషా దినోత్సవం నాడు ముఖ్యమంత్రి తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను రెండు, మూడు నెలల్లోనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, ఇంతవరకూ ఆ ప్రయత్నం ముందుకు సాగలేదన్నారు. తెలుగులో చదివితే భవిష్యత్తు ఉండదని మంత్రులే బహిరంగంగా ప్రచారం చేస్తున్నారని, మున్సిపల్ పాఠవాలల్లో తెలుగు మాధ్యమంలో పాఠాలు చెప్పకూడదని సాక్షాత్తు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించడంతో వారు ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారని విమర్శించారు. ఒక పక్క ప్రభుత్వం రెండు మాధ్యమాల్లో విద్యాబోధన ఉంటుందని చెబుతూనే మరోపక్క ఆంగ్లంలోనే ఇటీవల మాస పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. మున్సిపల్ పాఠశాలల్లో ఏ భాషలో చదువుకోవాలనే విషయాన్ని విద్యాశాఖ నిర్ధారించాల్సి ఉండగా, మున్సిపల్ శాఖ ఎందుకు జోక్యం చేసుకుంటుందని అగ్రహం వ్యక్తం చేశారు.


శ్రీ కల్కి అందరివారు
ఎం.బేగ్
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి, లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు 3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ..

# జియోఫోన్ కొనొచ్చా?

## కొన్ని అంశాలపై స్పష్టత ఇవ్వనిరిలయన్స్

**ము**కేష్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఆఫర్ చేస్తున్న 4జి ఫీచర్ ఫోన్ జియోఫోన్'ను కొనొచ్చా? ఈ ఫోన్‌ను కొనుగోలు చేయడం వల్ల కలిగే ప్రయోజనం ఏంటి? స్మార్ట్‌ఫోన్లు హల్‌చల్ చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ ఫోన్‌కు ఎందుకంత క్రేజ్ ఏర్పడుతోంది? జనం ఎందుకు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు? ఇలాంటి సందేహాలు అన్నివర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. అపరిమిత కాలింగ్ సదుపాయం, అపరిమిత డేటాతో సంచలనం సృష్టించిన రిలయన్స్ జియో.. 4జి ఫీచర్ ఫోన్ ద్వారా అదే రీతిలో సంచలనం రేపాలనుకుంటోంది. అందుకే 1,500 రూపాయలకే 4జి ఫీచర్ ఫోన్‌ను తెచ్చింది. దీని ద్వారా కొత్తగా కోట్లాది మంది కస్టమర్లను సంపాదించుకోవాలన్నది రిలయన్స్ ప్రధానమైన టార్గెట్.

**ఏమిటీ ఈ ఫోన్ ప్రత్యేకత?**

ప్రస్తుతం మార్కెట్లో వందల రకాల ఫీచర్ ఫోన్లు ఉన్నాయి. దేశీయ కంపెనీల ఫోన్లతోపాటు చైనా కంపెనీల ఫోన్లు కుప్పలుతెప్పలుగా మార్కెట్లోకి వస్తున్నాయి. 500 రూపాయలతోనూ ఫీచర్ ఫోన్‌ను కొనుగోలు చేసే పరిస్థితి ఉంది. ఇప్పటిదాకా 2జి, 3జి టెకాశీలజీకి సపోర్ట్ చేసే ఫీచర్ ఫోన్లే మార్కెట్లో ఉన్నాయి. 4జి టెక్నాలజీ, విఒఎల్‌టిఇకి సపోర్ట్ చేసే ఫీచర్ ఫోన్లేవీ రాలేదు. ఒకవేళ మార్కెట్లోకి వచ్చినా వీటి ధర ఎక్కువగానే ఉండేది. ఈ నేపథ్యంలోనే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న రిలయన్స్ 4జి ఫీచర్ ఫోన్‌ను అందుబాటులోకి తెస్తోంది. మన దేశంలో ఇప్పటికీ కోట్లలో ఫీచర్ ఫోన్లను వినియోగిస్తున్నారు. సైబర్ మీడియా రీసెర్చ్ తాజా నివేదిక ప్రకారం.. ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికంలో మన దేశంలో 6.18 కోట్ల మొబైల్ ఫోన్లు అమ్ముడయ్యాయి. వీటిలో 54 శాతం వాటా ఫీచర్ ఫోన్లదే. ఫీచర్ ఫోన్ల మార్కెట్లో 9 శాతం వృద్ధి నమోదు అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు చాలా మంది ఇప్పటికీ ఫీచర్ ఫోన్లను వాడేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి వాళ్లకు దగ్గర కావాలన్నది రిలయన్స్ వ్యూహం. వీళ్లని డేటాను తక్కువగా వినియోగించినా వాయిస్ కాల్స్‌ను మాత్రం ఎక్కువగా వాడుతుంటారు. రిలయన్స్ జియో తన కస్టమర్లకు అపరిమితంగా వాయిస్ కాల్స్‌ను, రోజుకు 1జిబి డేటాను ఆఫర్ చేస్తోంది. ఈ సదుపాయాలను వాడుకోవాలంటే కచ్చితంగా 4జికి సపోర్ట్ చేసే స్మార్ట్ ఫోన్ కావాల్సిందే. దీని కోసం కనీసం 5-6 వేల రూపాయలన్నా ఖర్చు చేయాలి. ఈ ఫోన్‌ను ఎలా ఉపయోగించాలో కూడా తెలియాలి. కాస్తోకూస్తో ఇంగ్లీష్ వచ్చి ఉండాలి. పల్లెల్లో ఉన్న నిరక్షరాస్యులు స్మార్ట్‌ఫోన్ జోలికే వెళ్లరు. ఈ నేపథ్యంలో రిలయన్స్ లక్ష్యంగా నిర్దేశించుకున్న కస్టమర్లను చేరుకోవడం సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అందుకే 4జి ఫీచర్ ఫోన్‌ను రంగంలోకి దించింది.

ఇక 1,500 రూపాయలంటే ఏమీ తక్కువ కాదు. ఇంత ధర ఉన్నప్పుడు ఫీచర్ ఫోన్‌ను ఎందుకు కొనాలనే ఆలోచన కూడా చాలా మందిలో ఉంటుంది. అందుకే రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ వ్యూహాత్మక ప్రకటన చేశారు. మూడేళ్ల తర్వాత ఈ ఫోన్‌ను తిరిగి ఇస్తే మీరిచ్చే 1,500 రూపాయలు వెనక్కి ఇచ్చేస్తామని చెప్పారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా మాత్రమే ఈ మొత్తాన్ని తీసుకోన్నట్టు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చాలా మంది మన డబ్బులు మనకి వచ్చేస్తాయి కదా అనే ఆలోచనతో ఫోన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉంది.




**స్పష్టతలేని అంశాలు...**

1,500 రూపాయలకే 4జి ఫీచర్‌ను కొనుగోలు చేసిన వారు మూడేళ్ల తర్వాత తిరిగి ఇస్తే డబ్బులు వాపస్ ఇవ్వనున్నట్టు ముకేష్ అంబానీ ప్రకటించారు. అయితే ఫీచర్ ఫోన్ మూడేళ్ల పాటు పని చేయడం అంటే కష్టమే. చేతిలోని ఫోన్ ఎప్పుడు జారి కింద పడి ముక్కలుగా మారుతుందో చెప్పలేము. ఈ ఫోన్ సక్రమంగా పని చేస్తేనే డబ్బులు ఇస్తారా? లేక ఫోన్ ఎలాంటి స్థితిలో ఉన్నా ఇస్తారా అన్న దానిపై స్పష్టత లేదు. ఈ ఫోన్‌లో ఒక సిమ్‌ను మాత్రమే వాడటానికి అవకాశం ఉంటుంది. కాబట్టి మరో సిమ్‌కు తావులేదు. ఆ సిమ్ స్లాట్‌లో మరో కంపెనీ సిమ్ కార్డు వేస్తే పని చేస్తుందా లేదా తెలియదు. ఇక ఫోన్‌తో పాటు సిమ్‌కార్డును కూడా రిలయన్స్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. నెలకు 153 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే రోజుకు 500 ఎంబిల డేటా, అపరిమిత కాల్స్ చేసుకునే అవకాశం ఉందని కంపెనీ చెబుతోంది. ఇది ఫీచర్ ఫోన్ కొనుగోలు చేసిన వారికే వర్తిస్తుందేమో మరి. ఇప్పటికే చాలా మంది 99 రూపాయలతో జియో ప్రైమ్ కస్టమర్లుగా మారిపోయారు. వీళ్ల- 399 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే మూడు నెలల పాటు రోజుకు 1జిబి డేటాతోపాటు ఉచిత కాల్స్‌ను పొందుతున్నారు. ఇలాంటప్పుడు 153 రూపాయల ఆఫర్‌ను (28 రోజుల కాలపరిమితి) ప్రైమ్ కస్టమర్లు వినియోగించుకునే అవకాశంవుండదు. అంటే దీన్ని ఫీచర్ ఫోన్ కస్టమర్లను దృష్టిలో ఉంచుకునే తెచ్చినట్టు జియో వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. ఇక ఇప్పటికే జియో సిమ్‌ను వాడుతున్న వాళ్లని ఈ ఫీచర్ ఫోన్‌లో ఆ సిమ్‌ను వినియోగించుకోవచ్చా లేదా అన్నదీ తెలియదు. ఒకవేళ వినియోగించుకునే అవకాశం లేకపోతే రెండు నెంబర్ల కోసం వేర్వేరుగా రీచార్జ్ చేయాల్సి ఉంటుందన్న మాట. ఇప్పటికీ జియో కస్టమర్లుగా మారని వారికి జియో ఫోన్‌ను కొనుగోలు చేయడం లాభమే. కానీ ఎప్పటి నుంచో జియో సిమ్‌ను వాడుతున్న వారికి నెలనెలా అదనపు భారమేనని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

**ఒక్కరోజులోనే 40 లక్షల ఫోన్లకు బుకింగ్స్**

జియోఫోన్ బుకింగ్స్ గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ముందస్తు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్‌లో జియో డాట్‌కామ్, మైజియో యాప్ ద్వారా బుకింగ్స్‌కు అవకాశం కల్పించారు. ఆఫ్‌లైన్‌లో రిలయన్స్ స్టోర్లలో బుకింగ్స్ చేసుకునే వెసులుబాటు ఇచ్చారు. 500 రూపాయలు చెల్లించి ఈ ఫోన్‌ను బుక్ చేసుకోవచ్చు. ఫోన్‌ను డెలివరీ తీసుకునే సమయంలో మిగతా 1,000 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఈ ఫోన్ల డెలివరీ ప్రారంభం అవుతుందని తెలుస్తోంది. కాగా ఈ ఫోన్లను బుక్ చేసుకోవడానికి ఒక్కసారిగా నెటిజన్లు ఎగబడటంతో జియో వెబ్‌సైట్ ప్రారంభంలోనే క్రాష్ అయిపోయింది. ఎన్ని సార్లు ప్రయత్నం చేసిన బుకింగ్ జరగని పరిస్థితి ఎదురైంది. జియో యాప్‌లోనూ ఇదే అనుభవం ఎదురైంది చాలా మందికి. అయితే ఒక్కరోజులోనే 30 నుంచి 40 లక్షల ఫోన్లకు బుకింగ్స్ జరిగినట్టు సమాచారం. మొదట బుక్ చేసుకున్న వారికి మొదటగా డెలివరీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించడంతో జనం ఎగబడి బుకింగ్స్ చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ ఫోన్లు అన్ని రిటైల్ స్టోర్లలోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మొదటి ఏడాదిలోనే 10 కోట్ల జియోఫోన్‌లను విక్రయించాలన్నది రిలయన్స్ లక్ష్యం. దీన్ని చేరుకోవాలంటే అన్ని స్టోర్లలోనూ అందుబాటులో వుంచాల్సి వస్తుందని పరిశ్రమవర్గాలు అంటున్నాయి.

**వ్యూహాలు రచిస్తున్న ప్రత్యర్థి కంపెనీలు**

రిలయన్స్ జియో అపరిమిత కాల్స్, డేటాను అందుబాటులోకి తీసుకురావడంతో ప్రత్యర్థి కంపెనీల్లో దడ మొదలైంది. జియోకు పోటీగా ఆ కంపెనీలు కూడా తమ టారిఫ్‌లను భారీగా తగ్గించాయి. ఇప్పుడు 1,500 రూపాయలకే 4జి ఫీచర్ ఫోన్‌ను రిలయన్స్ తెచ్చినందు వల్ల దీనికి పోటీగా కూడా ఫీచర్ ఫోన్‌ను తెచ్చేందుకు ఇతర టెలికాం కంపెనీలు వ్యూహాలు రచిస్తున్నాయి. లేనిపక్షంలో జియోతో పోటీ మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని కంపెనీలు గుర్తించాయి. ఎయిర్‌టెల్, ఐడియా కంపెనీలు 2,500 రూపాయల ధరతో 4జి ఫీచర్ ఫోన్‌ను తీసుకురానున్నట్టు ప్రకటించాయి. త్వరలోనే ఈ ఫోన్లు కూడా మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలపై ప్రభావం**

ఫీచర్ ఫోన్లను వినియోగించే వారు స్మార్ట్‌ఫోన్లకు మారిపోతారని ఇప్పటిదాకా మొబైల్ ఫోన్ పరిశ్రమవర్గాల అంచనా వేస్తూ వచ్చాయి. అయితే రిలయన్స్ జియోఫోన్‌తో ఆ ఆశలకు గండిపడే అవకాశం ఉందని ఇప్పుడు లెక్కలు వేస్తున్నారు. జియో ఫోన్‌లో వాట్సస్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌తోపాటు జియోకుచెందిన వివిధ యాప్స్‌ను ఉపయోగించుకcనే అవకాశం ఉంటుంది. కాబట్టి చాలా మంది స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా జియోఫోన్‌ను కొనుగోలు చేసే ఆస్కారం ఉందని అంటున్నారు. ఫలితంగా రానున్న కాలంలో ఫీచర్ ఫోన్ల అమ్మకాలు ఊపందుకుని, స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు తగ్గడానికి దారితీయవచ్చని భావిస్తున్నారు.

### ఇవీ జియోఫోన్‌లోని ఫీచర్లు...

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఫీచర్ ఫోన్ల మాదిరిగానే జియోఫోన్ ఉంది. 2.4 అంగుళాల క్యుడబ్లువిజిఎస్క్రీన్, కెఎఐ ఆపరేటింగ్ సిస్టమ్, 1.2 గిగాహెట్జ్ డ్యూయల్ కోర్ ప్రాసెసర్, 512 ఎంబి రామ్, 4జి మెమరీ (ఎస్‌డి కార్డుతో 128 జిబిలకు పెంచుకోవచ్చు), 2 మెగాపిక్సెల్ వెనుక కెమెరా, 0.3 మెగాపిక్సెల్ ముందు కెమెరా, 4జి విఒఎల్‌టిఇ, సింగిల్ సిమ్ (నానో), బ్లూటూత్ 4.1, ఎఫ్‌ఎం రేడియో, వై×ఫై, నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్‌ఎఫ్‌సి), జిపిఎస్, మైక్రో యుఎస్‌బి 2.0, 2000 ఎంఎహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయి. ఈ ఫోన్ తెలుగు సహా 22 భారత భాషలకు సపోర్ట్ చేస్తుంది. వీటిలోతెలుగు కూడా ఉంది. ఈ ఫోన్‌లో జియో యాప్‌లైన మైజియో, జియో టీవీ, జియో సినిమా, జియో చాట్, జియో మ్యాజిక్, జియో ఎక్స్‌ప్రెస్ న్యూస్ వంటి యాప్స్ ప్రీలోడెడ్‌గా వస్తాయి. వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి యాప్స్ కూడా ఈ ఫోన్‌లో ఉంటాయి.

# అమరావతిపై కేంద్రం మెలిక

## పెరగనున్న అంచనా వ్యయం

**రా.వా ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిని అంతర్జాతీయ నాణ్యతా, ప్రమాణాల్లో నిర్మించాలన్న ప్రణాళిక ముందుకు కదిలే పరిస్థితి లేదు. ఒక వైపు నిధుల కొరత సమస్య, మరో వైపు మౌలిక సదుపాయాల అందుబాటులో లేక పోవడం ఇందుకు కారణంగా ఉంది. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం ఒక ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), ఒక ఇన్నర్ రింగ్‌రోడ్ (ఐఆర్ఆర్), కృష్ణ, నది మీద ఐదు వంతెనలు, అనంతపురానికి భారీ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే అనుసంధానం ప్రభుత్వ యోచనగా పెట్టుకుంది. అయితే, అనేక మౌలిక సదుపాయాల కంపెనీలు ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటూ ఉండటం, కేంద్ర ప్రభుత్వ విధానాలూ ఈ ప్రాజెక్టుల అమలుపై అనేక అధికార టీడీపీ ప్రభుత్వం ప్రజలను ఆకర్షించేందుకు ఈప్రాజెక్టులపైన ఎన్నో ఆశలు పెట్టుకుంది ఇపుడీ ఆశలు నెరవేరే సూచనలు కనిపించడం లేదు. ప్రాజెక్టు ప్రణాళికలకు ప్రభుత్వ రెండు సంవత్సరాల క్రితమే తుది రూపునిచ్చింది. మూడు సంవత్సరాల్లోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలనుకుంది. అయితే, ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభమే కాని పరిస్థితి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసిందని చెప్పాలి. ప్రతిపాదిత ప్రాజెక్టుల్లో రాజధాని నగరానికి చుట్టూరా ఒక ఔటర్‌రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్)ను రూ.20వేల కోట్ల వ్యయంతో నిర్మించాలని ప్రాథమిక అంచనా కట్టింది. అదనంగా ఆరు వరుసలు రహదారి నిర్మాణానికిగాను గుంటూరు. కృష్ణ, పశ్చిమ గోదావరి మూడు జిల్లాల్లో సుమారు ఐదు వే ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్ధన మేరకు ఈప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమూ ఆమోదం తెలిపింది. అయితే, నిధుల కేటాయింపు, రహదారి ప్రణాళికకు నేషనల్ హైవే అధారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) సూత్రప్రాయ ఆమోదాన్నీ తెలిపింది. ఈక్రమంలో రహదా నిర్మాణానికి సేకరించిన భూమిని ఎన్‌హెచ్‌ఏఐకి ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. రెండవది, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారమూ చెల్లించాలి ఉంది. వాగ్దానం మేరకు కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులనూ అందుకోలేదని ఆర్థిక శాఖలోని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ స్థితిలో ప్రాజెక్టుకు నిధులను ఎలా వెచ్చించగలుగుతామని ఆయన నగరం కోసం రూ.5,000కోట్లు వ్యయంతో నాలుగు వరుసల ఇన్నర్ రింగ్ రోడ్ (ఐఆర్ఆర్)ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం. ప్రతిపాదనగా ఉంది. రాజధాని నగరాన్ని అనుసంధానిస్తూ నిర్మించాలని ప్రతిపాదించిన మూడు వంతెనలను ఐదు వంతెలుగా పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబూనాయుడు ప్రణాళికలో మార్పులు చేశారు. ఈవంతెనల నిర్మాణ వ్యయం రూ. 5,000 కోట్లు అవుతుందని అంచనాగా ఉంది. కొత్త రాజధాని నగర నిర్మాణానికి పెట్టుబడులు సమకూర్చేందుకు అనేక కంపెనీలు ఆసక్తితోనే ఉన్నాయని సమాచారం. అయితే, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పూర్తి చేయడమనేది రాష్ట్ర ప్రభుత్వానికి అతి పెద్ద సవాలుగా ఉంది. ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను కేంద్రం ఆమోదించిన మాట యదార్థమేనని ఆయన అంగీకరించారు. అయితే, బిల్డ్-ఆపరేట్-ట్రాన్సఫర్(బీఓటీ) విధానాన్ని నిర్బంధం చేస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. దీనికి తోడు మౌలిక సదుపాయాల కంపెనీల ఆర్థిక ఇబ్బందులూ అంతర్జాతీయ ప్రమాణాల్లో రాజధాని నిర్మించాలన్న తమ ఆలోచనను ముందుకు సాగనీయడం లేదన్నారు. రాజధాని నగరం నుంచి సాగే బైపాస్ రోడ్డు సహా విజయవాడ నగరం చుడుతూ సాగే రెండు ముఖ్యమైన ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచి పోయాయి.

# దసరా రోజు అసెంబ్లీకి శంకుస్థాపన

## శాసనసభ హైకోర్టు ఆకృతులలో మార్పు

**రా.వా ప్రతినిధి, అమరావతి :** ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా పరిపాలన నగరంలో నిర్మించ తలపెట్టిన శాశ్వత శాసనసభ, హైకోర్టు ఆకృతులను నార్మన్ పోస్టర్ బృందం మార్చింది. శాసనసభను వజ్రాకారంలోనూ, హైకోర్టు భవనాన్ని బుద్ధ స్థూపాకారంలోనూ మార్చి వాటిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నార్మన్ ప్రతినిధులు వివరించారు. ఆకృతులన్నీ సిద్ధం చేసుకుని విజయదశమి (దసరా)నాడు నిర్మాణ పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో శాసనసభ, హైకోర్టు భవంతులపై ముఖ్యమంత్రి చేసిన సూచనలకు అనుగుణంగా కొత్త ఆకృతులు సిద్ధం చేశామని పోస్టర్ అండ్ పార్టనర్స్ తెలిపారు. వీటితోపాటు అమరావతిలో పరిపాలన నగరానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై 400 పేజీల నివేదికను ఈనెల 25వ తేదీ నాటికి ప్రభుత్వానికి సమర్పిస్తామని వారు చెప్పారు. గత సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పిన మార్పుల ప్రకారం, శాసనసభ భవంతిని బౌద్ధ స్థూపాకారంలో మార్చి ఈ సవీన ఆకృతులకు రూపకల్పన చేసి నట్లు పోస్టర్స్ బృందం ప్రతినిధి క్రిష్ వివరించారు. రాజధానిలో కొత్తగా నిర్మించిన పోలీసుహెడ్‌క్వార్టర్స్ భవంతుల గురించి ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇవి తనకు బాగా నచ్చాయని చెప్పారు. చుట్టూ పచ్చదనంతో, ఆహ్లాదకర వాతావరణంలో ఐకానిక్ కట్టడాలుగా వీటిని తీర్చిదిద్దారని ప్రశంసించారు. రాజధానిలో నిర్మించే ప్రతి భవంతిని ఇలా విలక్షణంగా తీర్చిదిద్దాలని అన్నారు.

# ఖుర్బానీ పండుగ



"లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, ఇన్నల్‌హమద, వన్‌ని అమత్, అమత్, లకనల్ ముల్‌క్, లాషరీక్‌లక్."

ప్రపంచ ముస్లీంల ఆధ్యాత్మిక క్షేత్రం, దైవ గృహం అయిన కాబాకు హజ్ విధులు నిర్వహిచేందుకు వచ్చిన హాజీల నోట అనునిత్యం వెలువడే స్తోత్ర వచనాలు ఇవి.. జిల్‌హజ్జా నెలలో హజ్ హజ్ పండుగను ఖుర్బానీల పండగని, ఈదుల్ అజ్హా అవికూడా పేర్కొంటారు.

బక్రీద్ పండుగ అనగానే ప్రవక్త హజరత్ ఇబ్రహీం (అలైహి) తన ఏకైక కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్‌ను దైవమార్గంలో జిబాహ్ చేయడానికి ప్రయత్నినించిన సంఘటన మనకు గుర్తుకు వస్తుంది. హజరత్ ఇబ్రహీం (అలైహి) తన 86వ సంవత్సరపు వృద్ధాప్యంలో తనకు లేకలేక కలిగిన ఏకైక సంతానం హజ్రత్ ఇస్మాయిల్‌ను జిబాహ్ చేస్తున్నట్లు కలగంటాడు. కలలో చూసిన దృశ్యాన్ని దేవుని ఆజ్ఞగా భావించి, నిజంగానే తన ముద్దుల తనయుడిని దేవుని ప్రసన్నత కోసం జిబాహ్ చేయడానికి ఉద్యుక్తులవుతారు. ఆ మహనీయుని త్యాగ నిరతిని మెచ్చిన దైవం ఇస్మాయిల్ మెడపై కత్తిని తెగకుండా చేసి అందుకు బదులుగా పొట్టేలు బలిఇవ్వమని ఆదేశిస్తారు. ప్రవక్త ఇబ్రహీం అ ప్రకారంగానే పొట్టేలను బలి ఇస్తారు. తండ్రీ తనయుల అపూర్వ త్యాగానికి గుర్తుగా ఈదుల్‌జుహా పేరుతో ఈ పర్వదినాన్ని నిర్వహించడం ప్రపంచ వ్యాప్తగా ఆనవాయితీగా వస్తోంది.

"లబ్బైక్ అల్లాహుమ్మలబ్బైక్" అనే శబ్దం ఒక అపూర్వమైన, అనిర్వచనీయమైన మధురానుభూతి. ఆధ్యాత్మికతతో పాటు భాషా పరంగా చూస్తే, అరబ్లీ భాషలోని శబ్ద ప్రక్రియ ఒక ప్రత్యేకత ఉంది. అరబ్బీ భాషలో అవతరించిన పవిత్రఖురాను గ్రంథాన్ని నియమబద్ధంగా, లయబద్ధంగా, పారాయణం చేయడాన్ని ధార్మిక భాషలో "తజ్‌వీద్" అంటారు. పారాయణాన్ని 'ఖిరాత్' అని, పారాయణం చేసే వారిని 'ఖారీ" అని అంటారు. అరబ్లీ భాషలోని "అల్లాహ్" అనే పదం దీనికి మరో నిర్వచనంగానీ, సరిపోలిన మరోపదంగానీ లేదు. విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా ఇదే పదం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. "

అల్లాహ్ అన్న పదాన్ని సాధారణంగా దేవుడు, దైవం అంటాం. ఆంగ్లంలో గాడ్ అంటాం. ఇస్లామీయుల ప్రకారం సర్వసృష్టికర్తను ఒక్కో భాషలో ఒక్కో పేరుతో పిలుస్తూ ఉండవచ్చు. కానీ అన్ని భాషా పదాల్లో "అల్లాహ్" అన్నది అత్యంత విలక్షణమైన పదం. ప్రపంచవ్యాప్తంగా మహమ్మదీయులు సృష్టికర్తను సూచించే, పలికే ఏకైక పదం "అల్లాహ్", ఇస్లాం మతాన్ని అనుసరించే విశ్వవ్యాప్తంగా ఎక్కడ ఏ భాష మాట్లాడే వారైనా సరే తమ ప్రభువును "అల్లాహ్" అని మాత్రమే పిలుస్తారు. హజ్ యాత్రకై వెళ్ళే వారందరూ కొన్ని పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. వాటిల్లో కొన్ని 1) డ్రెస్ కోడ్ :హజ్, ఉమ్రా యాత్రికుల డ్రెస్ కోడ్‌ను "ఎహరామ్" అంటారు. ఇందులో పురుషులు కేవలం శరీరంపై ఓ శాలువాలాంటి తెల్లటి దుప్పటి కప్పుకోవాలి మహిళలైతే శరీరాన్ని దుస్తులతో నిండుగా కప్పుకోవాలి. ముఖంపై "పరదా దరించరాదు. ఎహరామ్ ధరించిన ప్రతి ఒక్కరు కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సువాసలు పెట్టుకోవడం, తలలో పేలు చంపడం నిషేదం.

**ఉమ్రా :** హజ్‌కు ముందు ఉమ్రా చెయ్యాలి. "అల్లాహుమ్మా ఇన్ని ఉరీదు హజ్జ తమతోయి" అని నియత్ చేసుకోవాలి. కాబతుల్లా (మక్కా) చుట్టూ ప్రదక్షిణ చేయాలి. సఫా మర్వా రెండు పర్వతాల మధ్య నడవడం), శిరోమండనం చేయించుకోవాలి పురుషులు. స్త్రీలు మాత్రం కేవలం నాల్గు అంగుళాలు కత్తిరించుకోవాలి. దీన్ని ఉమ్రా అంటారు

**జిల్‌హజ్జ :** ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన ప్రతి ముస్లిం ఫరజ్ సమాజ్ చదివి మాక్కానుంచి మీనా అనే ప్రాంతానికి వెళ్ళాలి. అక్కడే రాత్రి బస చేయాలి. మరునాడు ఫజర్ నమాజ్‌ను జొహర్‌లోనే (ఏకకాలంలో) పాటించాలి. అక్కడి నుండి బయలుదేరి "ముజ్దలిఫా" ప్రాంతానికి చేరుకోవాలి. అక్కడ మగ్‌రీబ్, ఇషా నమాజులు రెండు ఏకకాలంలో జరుపుకొని రాత్రి అక్కడే బస చేయాలి. మరుసటి రోజు ఉదయం ఫజర్ తర్వాత మీనాకు వెళ్ళాలి. ఇది ఫర్జ్, మీనా చేరుకున్న తరువాత జొహర్ లోపు ఆ ప్రాంతంలో ఉన్న మూడు పిల్లర్లకు ఏడు కంకరరాళ్ళు కొట్టాలి.

**మీనాలోనే ఖుర్బానీ విధిని పూర్తి చేయాలి :**

ఈ కార్యాన్ని 'జమ్రాత్' అంటారు. మొదటిసారి రాయి కొట్టినప్పుడు "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్" అనాలి. మిగిలిన ఆరు రాళ్ళు కొట్టేటప్పుడు "అల్లాహు అక్బర్" అనాలి. ఆ తర్వాత ఖుర్బానీ ఇవ్వాలి. ఈ రెండు రోజులు హాజీలు మీనాలోనే ఉండి జొహర్ తర్వాత మగ్రీబ్ లోపు కాబతుల్లా చుట్టూ ప్రదక్షిణ చేయాలి. దీన్ని "తలపై జియారా" అంటారు. ఇది ఫర్జ్. తవాఫ్ చేయకపోతే హజ్ అసంపూర్తి అవుతుంది. 4) ఆబెజమ్‌జమ్ : హజ్ యాత్రకు వెళ్ళినవారు రోజూ కడుపారా అబెజమ్‌జమ్ స్వీకరిస్తారు. తిరిగి తమతమ ప్రదేశాలకు వచ్చేప్పుడు సుభప్రదమైన జమ్‌జమ్ నీళ్ళు తెచ్చుకుంటారు. ఆ నీరు తాగితే ఆకలి కాదు. సర్వరోగాలు నయమవుతాయని నమ్మకం. ఇది అత్యంత పరిశుద్ధ జలం, దీని సుగుణాలు శాస్త్రీయ పరిశోధనల్లో రుజువులుగా తేలాయి.

**– హుస్సేన్ ఖాన్,**
**అధ్యక్షులు ముస్లిం వెల్‌ఫేర్ సోసైటీ రాయపూడి**

# జనాలు తిట్టుకుంటున్నారయ్యా

## వినాయకుడి మనోవేదన



ఏంటయ్యా ఇది మిమ్మల్నే.. నా పేరు తలుచుకుంటే గానీ ఏ పని మొదలు పెట్టరు. కానీ నన్నే అవమానిస్తున్నారే అందరూ చేసుకునే పండుగని చివరికి తిట్టుకునే దండకంలా చేశారు. మా అమ్మ నన్ను పసుపుతో చేస్తే మీరేమో దాన్ని కాస్తా ప్లాస్టరాఫ్ ప్యారిస్ లోకి మార్చేశారు. నాకేం రంగులు కావాలని అడిగానా?మట్టితో చేస్తే వరాలివ్వనన్నానా? వేదాలలో నన్ను బొటనవేలంత చేస్తే చాలని చెబితే, మీ ఇష్టం వచ్చిన్నట్లు నా ఎత్తు పెంచేస్తున్నారు. నాకు నాతోటే పోటీ పెడతారా? ఒక్క అడుగుతో మొదలై అరవై అడుగులకు చేర్చేశారు. ఒకరిని చూసి ఒకరు ఇలా నా ఎత్తు ను పెంచేస్తే దాన్ని భక్తను కోవాలా? లేక వేలం వెర్రనుకోవాలా? ఎంత ఎత్తు అన్నది కాదయ్యా ఎంత భక్తి అన్నదే ముఖ్యం.పోనీ సంవత్సరానికి ఒకసారైనా మీరు పిలిచారు కదా అని నేను వస్తే , ఒక వేదపారాయణం లేదు, మంచి సంగీతం లేదు. వెకిలి పాటలు వెర్రి డాన్సులు.. అదీ నా పెద్ద చెవులు హోరెత్తి పోయేలా. ఇక చుట్టు ప్రక్కల జనాలు రోజూ అష్టోత్తరం సంగతి ఎలా ఉన్నా , మీ గోలకి తిట్ల దండకం చదువుతున్నారు. అవునూ! నాకు లడ్డూలు ఇష్టమని ఎవరయ్యా చెప్పారు. నేను ఉండ్రాళ్ళకు బ్రాండ్ అంబాజిటర్ ని కదా! మరి ఆ లడ్డూలేంటి? వాటి సైజులేంటి పైగా ఆ వేలం పాటలేంటి? అసలు నా కథా, నా రూపమే కాదు. నా ప్రసాదం కూడా మార్చేస్తారా? ఆ విష్ణుమూర్తికి పది రూపాలే , కానీ నాకెన్ని పెట్టారూ. నాతో క్రికెట్ ఆడించారు. గ్లోబ్‌ల మీదకెక్కించారు, మోటర్ సైకిల్ తొక్కించారు. నా ట్రేడ్ మార్కెట్ అయిన బుజ్జి పొట్టను తీసి సిక్స్‌పాక్ పెట్టారు. టోపీలు పెట్టారు, తల పాగా చుట్టారు. సినిమా హీరోలా తయారు చేశారు. ఆ పరమ శివుడు ఒక్కసారి నా రూపం మారిస్తే , మీరు ప్రతేడూ నా రూపం మారుస్తున్నారు. అసలే గతుకురోడ్లతో ట్రాఫిక్‌జామ్ అవుతుంటే, నా పండుగ పేరు తో వాటిని ఇంకాస్త పెంచేలా రోడ్లపై ఆ ఊరేగింపులేంటి , ఆ డాన్సులేంట ? జనాలు ఇళ్ళకు చేరలేక నన్ను తిట్టుకుంటున్నారయ్యా. నిన్నటికి నిన్న సిటీ మొత్తం చెట్లకి చెట్లు కొట్టేస్తున్నారు. ఏంటయ్యా అంటే నిమజ్జనం రోజు అడ్డొస్తాయి అంటున్నారు. నాకు ఆకులు అలమలు అంటే ఇష్టమని తెలిసి వాటిని ఇచ్చే చెట్లను నా పేరు చెప్పి నరికేస్తుంటే ఇదెక్కడి పండగయ్యా ? ఇక నిమజ్జనం గరించి చెప్పేదేముందీ, నిమజ్జనం రోజున భక్తి ముసుగులో మీరు చేసే పనులు అంతా ఇంతా కాదు. నా విగ్రహం వెనుక క్వాటర్ బాటిళ్ళ కేసులు, గుడుంబా క్యాంపులు. నా విగ్రహం ముందు తాగి తూలుతూ వికృత విన్యాసాలు ,హోరెత్తే డ్రమ్ములు మైకుల రణగొణ ధ్వనులు, తాగి మైమరచి మీరు వేసే కేకలకి మీ నోటి నుండి వచ్చేగుడుంబా తుంపర్లు నా మీద పన్నీరులా చిలకరిస్తూ నన్ను ఊరేగిస్తున్నారు. మీ దగ్గర వచ్చే గుడుంబా వాసన కంటే ఆ హుస్సేన్ సాగర్ కంపే ఎన్నో రెట్లు మేలని పిస్తోంది. నా కొద్దు బాబోయ్ ఈ నిమజ్జనం సారీ..









Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd. D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at 6-45/1, Rayapudi, Guntur (DT), A.P. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18